AL - HILAL مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

హిజ్రీ శకం 1432 - జుల్ ఖిదా

నెలవంక

మాస పత్రిక

Vol 8, Issue: 60 OCTOBER - 2011



మనుషుల తోళ్ళు కప్పుకున్న తోడేళ్ళు

నీ పిలుపుకి సమాధానంగా..

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية



నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 60
OCTOBER 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY

Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net
Tel. 99993072

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

ఈ సంచికలో....



మానవ జాతికి మేలి మలుపును ఇచ్చిన మహా మనీషి ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)



క్యా.....న్స.....ర్...!



ప్రజా సంబంధాల ప్రాముఖ్యత



మనుషుల తోళ్ళు కప్పుకున్న తోడేళ్ళు	2
ప్రవక్త ఇబ్రాహీమ్ (అ)	4
క్యాన్సర్	7
మానసిక ఒత్తిడిని జయించడమెలా?	8
ప్రజా సంబంధాల ప్రాముఖ్యత	10
ఇస్లాం శిక్షణ	12
కవితా కుసుమాలు	13
పూ పరిమళం	14
కాఫి విథ్ నెలవంక	15
ఐపిసి వార్తలు	16
నీ పిలుపుకు సమాధానంగా	18

كلمة العدد عن تاريخ صومال - دروس من سيرة إبراهيم - العادات التي تسبب السرطان - النجاة من ضغط النفس - أهمية العلاقة مع الناس في ضوء السيرة - أرض العرب (نشيد) - ليس كمثله شيء (نشيد) - تربية المهتدين - الظلم علي النفس (نشيد) - جوامع الكلم - اختبر معلوماتك - نشاط اللجنة - أدعوه يستجيب لكم - الحياة كالسفر





మనుషుల తోళ్ళు కప్పుకున్న తోడేళ్ళు



సయ్యద్ అబ్దుస్సలాం ఉప్పీ
abdussalamsyed@ymail.com



దేశం పేరు: సోమాలియా
రాజధాని: మగ్దీషియో
స్వాతంత్ర్యదినం: 1-7-1960
విస్తీరణ స్థలం: 637657 కిమీ
నీరు గల స్థలం: 10320 కిమీ
ఎండు భూమి: 627337 కిమీ
భాష: సోమాలియా, అరబీ, ఇటాలీ, ఆంగ్లం.
మతం: ఇస్లాం
1991 తర్వాత 27-08-2000 సంవత్సరంలో ఎన్నోకోబడిన అధ్యక్షుడు: అబ్ది ఖాసిమ్ సలాద్ హసన్
జన సంఖ్య 2003 నివేదిక ప్రకారం -
0 -14 మధ్య వయసుగల వారు
పురుషులు: 1802154
స్త్రీలు: 1792749
15-65 మధ్య వయసు గలవారు
పురుషులు: 2120934
స్త్రీలు: 2093699
65కి పై వయసు గలవారు
పురుషులు: 93682
స్త్రీలు: 121972



తన చూపుడు వేలు నీడలో ధరాగోళం ఒదగాలని, తన ముంగిట్లో ధన రాసులన్నీ తలలు వాల్చి నిలవాలని, అహంకార దాహం ధ్వజమెత్తిరాగా, ఆక్రమణ మోహం కరళ్ళెత్తిపోగా కదను తొక్కే ఉక్కు కాళ్ళ కింద కమిలి పోతున్న అసువుల మొక్కలు. పొగరు ఆయుధాల పాశవిక క్రీడలో ఎగిరిపడుతున్న శిరస్సులు. కురిసిన నర రక్తం స్పర్శతో ఎరుపెక్కిన సరస్సులు. ఏ పశుత్వం కొమ్ము విరిసిందని ఈ విలయవిహారం? ఏ అధర్మం కాలు దువ్విందని ఈ భయద భయంకర సంహారం? ఇళ్ళనూ, పండి ఒరిగిన పైరుమళ్ళనూ నిప్పు కుంపటిలో ఎందుకు నిలువునా నెట్టినట్టు? ప్రాణాలనూ, ప్రాణాధికంగా కాపాడుకునే మానాలను రక్కసి గోళ్ళతో ఎందుకు రక్కుకు పోతున్నట్టు? విజేతగా నిలవాలంటే విశ్వాన్నే భస్మం చేయాలా? ధరాలోభం తీరాలంటే నర రుధిరమే సాగించాలా? కనిపిస్తున్నాయి అడుగుకంటికి మనుషుల తోళ్ళు కప్పుకున్న తోడేళ్ళు. వినిపిస్తున్నాయి అడుగుచెవికి తునిగిపోతున్న అరవలేని లేళ్ళ నోళ్ళు. అయ్యో మనిషీ! అహంకార రంగద్దాలను అంతరంగానికి తొడుక్కున్న మసీ! తెలుపునలుపుల కోలమానాలతో, వర్ణ, వర్ణ, కుల దురభిమానాలతో మనిషి విలువ కడుతున్నావా? మానవత్వంతో ముడి పెడుతున్నావా? దానవత్వానికి పట్టం కడుతున్నావా? మల్లెపువ్వుకూ నల్లకలువకూ ఎల్లలు పెడుతున్నావా? సాటి మనిషిపై స్వారీ చేస్తూనే శాంతి శాసనం వల్లిస్తున్నావా? తోడేలులా ప్రజా–తన, మాన, ధనాలను పీక్కు తింటూ ఏమి ఎరుగనిమేకలా నటిస్తున్నావా? తెలుపు రంగు తలకెక్కిన పైత్యం ఎండుగరికలా తేలిపోతుందని తెలియదా నీకు? ...ఎక్కడా ...ఎక్కడా అని తెల్లబోతున్నారా!? ఇక్కడే అక్షరాల అవని మీదే జరుగుతోంది ఈ దారుణం, మానవ హరణం. అందులో భాగమే నేటి సోమాలియా దుర్భిక్ష స్థితి. వివరాల్లోకెళితే – ఒకనాటి సోమాలియా ప్రాభవం ఇలా ఉంది.

పురాతన ఈజిప్ట్, గ్రీకు, ఫర్షియా, రోమన్ సామ్రాజ్యాలతో వర్తక, వాణిజ్యాలు నేర్పి సిరులు కురిపించిన దేశం సోమాలియా. సుగంధ ద్రవ్యాలు, పాడిపత్తుల ఉత్పత్తితోపాటు బంగారం, ఏనుగు దంతాలు, జంతు చర్మాలు వంటి విలువైన వస్తువుల విక్రయంతో అలరారింది అలనాటి సోమాలియా స్వర్ణయుగం. పాశ్చాత్య దేశాలు, అలనాటి భారత్‌తోనూ అప్పట్లో సంబంధాలు జరిపిన సోమాలియా ద్వారా మన నాటి వర్తకులు ఎన్నో లాభాలు అందుకున్నారు. మధ్య దర, ఎర్ర సముద్ర మార్గాలలో వారి ఈ భాగస్వామ్య వాణిజ్యం వందల ఏళ్ళు కొనసాగింది. అలా కాలక్రమంలో మగ్దీషియో రాజధానిగా ఏర్పాటు చేసుకున్న సోమాలియా తర్వాత మొనో, మోపటాన్ గనులలో వెలుగు చూసిన పసిడితో ప్రగతికి బాటలు వేసుకుంది. ఆఫ్రికా ఖండం మొత్తం మీద మరే దేశానికి లేనంతగా అత్యంత పొడవైన తీర రేఖ ద్వారా లభించిన అవకాశాలను అందిపుచ్చుకుని అభ్యుదయ దిశన పయనించింది. ప్రపంచ కళ్ళను ఆకర్షించింది. అయితే తమకు ప్రాప్తమయి ఉన్న ప్రకృతి వరాలే తర్వాత తమ పాలిట శాపంగా పరిణమిస్తాయని ఊహించలేకపోయారు సోమాలియా వాసులు. చీకటి ఖండం నుంచి సమృద్ధ సంపదలతో తులతూగుతున్న సోమాలియాపై ఐరోపా సామ్రాజ్య వాద శక్తులు, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల డేగ కళ్ళు పడింది మొదలు ఒక్కసారి పరిస్థితి మొత్తం తలక్రిందులై పోయింది.

అక్కడ **'విభజించి పాలించు'** సూత్రాన్ని అమలు పర్చిన పాశ్చాత్య పెద్దలు సోమాలియా సుల్తానుల మధ్య చిచ్చు పెట్టి దేశాన్ని చిరిగిన విస్తరిగా మార్చారు. సోమాలియాను ఆనుకుని ఉన్న చారిత్రాత్మక సూయస్ కెనాల్‌పై ఆధిపత్యం, సువిశాల నౌకాగ్రియ నగరాల ఆక్రమణలకు సాగిన కుయుక్తులు రాజకీయ అస్థిరతను సృష్టించి చిమ్మచీకట్లు క్రమ్ముకునేలా చేశాయి. ముక్కలు చెక్కలుగా మారిన సోమాలియా ఇటలియన్ సోమాలియా ల్యాండ్, బ్రిటన్ సోమాలియా ల్యాండ్ వలస వాద కాలనీగా మారి దారుణ దోపిడికి గురయింది. తాతలు తండ్రుల నుంచి వచ్చిన ఆస్తులూ పోయాయి. రాచరిక సంపద తరలించేశారు. ఆలానాపాలనా లేని సువిశాల సముద్ర తీరం అన్యాక్రాంతమై పట్టుకోవడానికి చేప పిల్ల కూడా దొరక్క ఆకలికేకలు, ఆర్తనాదాలు మిన్నంటాయి. అప్పట్నుంచి పూర్వీకులు వదలివెళ్ళిన అంతులేని సంపదతోపాటు వలసవాదుల దోపిడితో సర్వం కోల్పోయి ఒమికలు తేలిన అల్పజీవులుగా మిగిలిన సోమాలియాకు ఎట్టకేలకూ 1960లో స్వేచ్ఛా వాయువులు లభించాయి. ఐక్య రాజ్య సమితి చొరవతో బ్రిటన్ సోమాలియా ల్యాండ్, ఇటలీ సోమాలియా ల్యాండ్‌లు రెండింటిని ఒక్కటి చేసిన పెద్దల జోక్యంతో రిపబ్లిక్ ఆఫ్ సోమాలియా ప్రజాస్వామ్యయుత రాజ్యాంగం అని ఏర్పాటయ్యాయి. కానీ అదీ మూన్నాళ్ళ ముచ్చటే అయింది.



1969లో దేశ అధ్యక్షుణ్ణి కాల్చి చంపి అధికారాన్ని చెప్పుచేతల్లో తీసుకుంది సైన్యం. పార్లమెంటు లేదు, న్యాయస్థానం లేదు, రాజ్యాంగం మాటే లేదు. సర్వం నియంతృత్వం. సోమాలియా సోషలిస్టు రిపబ్లిక్ పార్టీదే ఇష్టారాజ్యం. క్రమంగా ప్రజల్లో పెరిగిన అసంతృప్తి, నిరంకుశ సైనిక పాలనంటేనే చెప్పలేనంత ఏవగింపు. ఫలితం – 1991లో బ్రద్దలయిన సోమాలియా అంతర్యుద్ధం. పట్టుకోల్పోయిన అధ్యక్షుడు బరే పదవి కోల్పోయాడు. దేశాన్ని నిప్పు కుంపటిలో నెట్టాడు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ సోమాలియా మొత్తాన్ని పాలించే ఒక కేంద్ర ప్రభుత్వమే లేకపోయింది. ప్రభుత్వంలేని ప్రజలకు సౌకర్యాలు మాత్రం ఎక్కడి నుంచి వస్తాయి? ఇంకా అంతర్యుద్ధ మాటున బలపంతుడిదే రాజ్యం. మిగిలి కొద్దిపాటిలోనూ అందినకాడికి దోచుకోవడం, అడ్డం తిరిగిన వారిని తుపాకి తూటాలకు బలి పెట్టడం, ఇది చాలదన్నట్లు ఇదే సమయంలో తీవ్ర రూపు దాల్చిన కరువు పరిస్థితులు సోమాలియాను ఎక్కడా కోలుకోనివ్వలేదు. నిలదొక్కుకునే అవకాశం ఇవ్వలేదు. అధికారిక గణాంకాల ప్రకారం తుపాకీ తూట్లకు ప్రాణాలు కోల్పోయినవారు 3 లక్షల మందికి పైచిలుకే. ముద్ద ఆహారం దొరక్క ఆకలితో ఆలమటించి ఆఖరి శ్వాస వదలినవారు కూడా దాదాపు అంతే మొత్తంలో ఉన్నారు. ప్రస్తుతం అయితే కనీస ఆహారం, వైద్య సదుపాయం లేక ప్రతి 6 నిమిషాలకు ఒక పిల్లాడు మరణిస్తున్నాడు. ఇంకొన్ని నెలల్లో మరణించేవారి సఖ్యం 7 లక్షలకు చేరుకునే అవకాశం ఉందంటున్నారు.

ఏది ఎలా ఉన్నా ఒక దేశం ఇటువంటి దుర్భిక్ష స్థితికి గురవడం వెనకాల కేవలం బాహ్య కారణాలే పని చేసి ఉంటాయని చెప్పలేము. ఖచ్చితంగా అంతరంగిక, ఆధ్యాత్మిక కారణాలు ఉండి తీరాలి. అదేమంటే, **'కరడు గట్టిన ఇస్లాం ఛాందస వాదం'** అనంటారు కొందరు. కాదు, ఎంత మాత్రం కాదు. ఇస్లాం ఛాందస ధర్మం కాదు, అది శాంతిశ్రేయాల ధర్మం. మానవజాతి మనుగడకు బాటలు వేసే ధర్మం. మానవజాతిని సవ్యమైన దిశలో నడిపించి, అటు దైవానికి, ఇటు స్వర్గానికి దగ్గర చేసే జీవన విధానం. అసలు కారణం మనిషి, అతని ప్రవర్తనే అనాలి. దైవ శాసనాలను కాల రాసి, దైవానుగ్రహాల పట్ల కృతఘ్నత చూపే ప్రతి జాతి. ప్రతి దేశం, ప్రతి పట్టణానికి పట్టే గతి ఎలా ఉంటుందో ఖుర్‌ఆన్ పేర్కొంటున్నది:

"అల్లాహ్ ఒక పట్టణ ఉదాహరణ ఇస్తున్నాడు. ఆ పట్నం ఎంతో ప్రశాంతంగా, తృప్తిగా ఉండేది. దానికి అన్ని వైపుల నుంచీ పుష్కలంగా జీవనోపాధి లభించేది. అయితే ఆ పట్టణ వాసులు అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతఘ్నత చూపగా, అల్లాహ్ వారి స్వయంకృతాలకు బదులుగా వారికి ఆకలి, భయాందోళనల రుచి చూపించాడు". (అన్నహ్ల్: 112)

ఒక దేశం ప్రగతి బాటలో పయనించాలంటే శాంతి భద్రతలతోపాటు పుష్కలమైన జీవనోపాధి ఎంతో అవసరం. ఈ రెండింటిలో ఏ ఒక్కటి కొరవడినా అక్కడ అభ్యుదయం, అభివృద్ధి, వికాశం ఉండదు. ఈ కారణంగానే శాంతిభద్రతలను, పుష్కల జీవనోపాధిని దేవుడు తన ప్రత్యేక అనుగ్రహంగా పేర్కొన్నాడు:

"ఆయనే వారికి ఆకలిగొన్నప్పుడు ఆహారం ప్రసాదించాడు.
భయాందోళనల స్థితిలో భద్రత కల్పించాడు". (ఖురైష్: 4)

మరి దీనికి పరిష్కార మార్గం అంటూ ఒకటి లేదా? అంటే, ఉంది. అదేమిటో సర్వలోక పరిపాలకుడు, పోషకుడు, సంరక్షకుడు అయినా అల్లాహ్‌యే స్వయంగా తెలియజేస్తునా డు:

"మీలో ఎవరు విశ్వసించి, మంచి పనులు చేశారో వారికి అల్లాహ్, వారి పూర్వీకులను భూమికి ప్రతినిధులుగా చేసినట్లుగానే వారికి కూడా తప్పకుండా ప్రాతినిధ్యం వొసగుతానని, తాను వారి కోసం సమ్మతించి ఆమోదించిన ధర్మాన్ని వారి కొరకు పటిష్టం చేసి, దానికి స్థిరత్వాన్ని కల్పిస్తానని, వారి (ప్రస్తుత) భయాందోళనల స్థానే శాంతిభద్రతలు కల్పిస్తానని వాగ్దానం చేసి ఉన్నాడు". (అన్నూర్: 55)

దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: **"ఎవరైతే ఆరోగ్యవంతమైన దేహంతో, ప్రశాంత వాతావరణంలో, ఆ రోజుకు సరిపడ ఆహారంతో ఉదయం చేస్తారో వారి వద్ద ప్రాపంచిక సకల సంపదలు ఉన్నట్లే లెఖ్ఖ"** అని. అల్‌హమ్దులిల్లాహ్ ఆ విధంగా చూస్తే మనం ఆర్థికంగా, శాంతిభద్రతల పరంగా ఎంతో మెరుగైన స్థితిలో ఉన్నాము. మరి దుర్భిక్ష స్థితికి లోనై ఉన్న ప్రజల్ని మనవంతు ఆదుకోవడం మన బాధ్యత కాదా? వారి ఆ దుర్భిక్ష స్థితి దూరమై శాంతిభద్రతలు లభించాలని వేడుకోవడం మనందరి కనీస ధర్మం కాదా? అందరూ సహజంగా స్పందిస్తారని ఆశిస్తూ...!!

గత మూడు నెలల్లో మరణించిన 5 ఏండ్ల లోపు వయసు గల పిల్లల సంఖ్య - 29.000
ప్రాణం నిలుపుకునేందుకు కనీసఆహార సదుపాయం లేక అల్లాడి పోతున్న చిన్నారుల సంఖ్య - 2,300,000
ఎథియోపియా, కెనియా, జిబోజి ప్రక్క దేశాలలో ఆహార లేమికి గురై ఉన్నవారి సంఖ్య - 12,000,000
తక్షణ కనీస ఆహార, వైద్య సహాయం కావాల్సినవారి సంఖ్య - 3,200,000
ప్రతి రోజు క్యాంపులకు తరలి వస్తున్న వారి సంఖ్య - 2,000
మగ్దీషియో రాజధానికి ఇతరత్రా ప్రాంతాల నుండి జూలై వరకు చేరుకున్న వారి సంఖ్య - 400,000
తక్షణం కావాల్సిన సహాయం - యుఎస్ డాలర్స్- 2,000,000,000
ఇప్పటి వరకు అందిన సహాయం యుఎస్ డాలర్స్- 570,000
ఈ దుర్భిక్ష స్థితి ఇలానే కొనసాగితే వచ్చే కొద్ది నెలల్లో మరణించే పిల్లల సంఖ్య - 7,00,000 నుండి 8,00,000





ప్రవక్త ఇబ్రాహీమ్ (అ.స.)

మానవ జాతికి మేలి మలుపును ఇచ్చిన మహా మనిషి

ధనం, ఐశ్వర్యం, పాలం వారసత్వంగా లభించవచ్చేమోగానీ, ఇస్లాం మాత్రం వారసత్వంగా లభించేది కాదు. దేవుని కృపాకటాక్షాలతోపాటు 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నట్టు - దాన్ని మనిషి అన్వేషించి, శోధించి సాధించుకోవాలి. అధిక శాతం మంది ప్రవక్తలు అవిశ్వాసుల ఇంట, బహుదైవారాధనా సమాజంలోనే జన్మించారు. అలా జన్మించిన వారిలో ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ఒకరు. ఆయన తత్వం వేరు. ప్రతి విషయాన్ని నిశిత దృష్టితో తరచి చూడటం ఆయనకు అలవాటు. మనిషి స్వహస్తాలతో చేసిన ప్రతిమల ముందు వంగటం, సూర్య చంద్ర నక్షత్రాల ముందు మోకరిల్లడం, అల్పాతిఅల్ప ప్రాణులకి అలౌకికానందంతో హారతులు పట్టడం, భక్తీ పారవశ్యాలతో చేతులు జోడించి నిలబడటం ఆయనకు మింగుడు పడలేదు.

కర్రి మబ్బుల కరాళ నృత్యానికి విసుగు చెందిన మానవాళికి ఆయనో ఉదయ కిరణం. అసత్య అంధకారాలను రూపు మాపి వెలుగుల్ని నింపిన ధర్మతేజం ఆయన. మార్గభ్రష్టత్వంలో మ్రగ్గే మానవ హృదయాలను ప్రక్షాళనం గావించి, రుజుమార్గం ఇదని తెలియజేసిన ఆశాజ్యోతి ఆయన. చైతన్యాన్ని జలింపజేసే సత్తువ, మనస్సులను కదిలించే ప్రేరణ, హృదయాల్ని ఏలే శక్తి ఒక్క త్యాగానికి మాత్రమే ఉందనడానికి ఆయన నడక, నడవడిక ప్రబల తార్కాణం. యుగయుగాలుగా నిద్రాణంలో ఉన్న ప్రజల్లోని ప్రతిభాపాటవాలను చైతన్యపరచి సత్య మార్గంలో నడిపించిన అపురూప రథసారథులందరికీ మూల పురుషుడు ఆయన. తన అస్తిత్వం రీత్యా ఆయన ఒక మనిషి మాత్రమే. కాని తన అసాధారణ త్యాగాల దృష్ట్యా, ఘనకార్యాల రీత్యా ఆయన ఒక సమాజం. ఓ గొప్ప అకాడమి! ఈ కారణంగానే ప్రవక్తల పితామహినిగా నేటికీ అటు యూదక్రైస్తవులు, ఇటు ముస్లిం సముదాయం హృదయాలలో సమానంగా చిరస్మరణీయులయ్యారు. ఈ ఘనతావిశిష్టతల మూలంగానే అల్లాహ్ ఇలా సెల విచ్చాడు:

"ఇది ఇబ్రాహీం (అ) జీవన ధర్మం. శుద్ధ అవివేకి మాత్రమే ఇబ్రాహీమ్ పాటించిన జీవన సరళి పట్ల వైముఖ్యం చూపగలడు. మేము అతన్ని ప్రపంచంలోనూ ఎన్నుకున్నాము. పరలోకంలో కూడా అతను సజ్జనుల సరసన ఉంటాడు". (బఖర: 130)

"ఒక వ్యక్తి అల్లాహ్ ముందు తల వంచి, సదాచారసంపన్నుడై ఉండి, ఏకాగ్రతచిత్తుడై ఇబ్రాహీము ధర్మాన్ని అనుసరిస్తే - ధర్మం రీత్యా అతనికంటే ఉత్తముడు మరెవడు కాగలడు? ఇబ్రాహీమ్(అ)ను అల్లాహ్ తన మిత్రునిగా చేసుకున్నాడు". (అన్నిసా: 125)

ఈ ఎంపిక ఏ ఆధారంగా జరిగింది?

"నిన్ను నీవు (నాకు) సమర్పించుకో" అని అతని ప్రభువు అతన్ని ఆదేశించినప్పుడల్లా **'సకల లోకాల ప్రభువుకు నన్ను నేను సమర్పించుకుంటున్నాను'** అని అతను సమాధానమిచ్చాడు. (బఖర: 131)

"జ్ఞాపకం చేసుకోండి! ఇబ్రాహీమ్ (అ)ను అతని ప్రభువు అనేక విషయాలలో పరీక్షించగా, అతను అన్నింటిలోనూ (నికార్సుగా) నెగ్గుకు వచ్చాడు. అప్పుడు అల్లాహ్ అతన్ని ఉద్దేశ్యించి- **"నేను నిన్ను ప్రజలకి నాయకునిగా చేస్తున్నాను"** అన్నాడు. (బఖర: 124)

ఆయన తీసుకొచ్చిన జీవన ధర్మం ఏది?

"ఇబ్రాహీమ్ (అ) యూదుడూ కాడు. క్రైస్తవుడూ కాడు. ఆయన ఒకే దేవుని వైపు అభిముఖుడైన ముస్లిం-విధేయుడు. ఆయన బహుదైవారాధకులలోని వాడు ఎంత మాత్రం కాడు". (ఆలి ఇమ్రాన్:67)

ఆయన ప్రజలను యూదత్వం వైపునకో, క్రైస్తవం వైపునకో, ఆహ్వానించలేదు. ఆ మాట కొస్తే ఈ మతాల ఉనికే అప్పటికి లేదు. ఆయన ప్రబోధించింది తౌహీద్-ఏకేశ్వరోపాసనను మాత్రమే. దాసుడు దేవుని ఆదేశాలకు శిరసావహించడం అనే నిజం గురించే ఆయన నొక్కి వక్కాణించారు తప్ప త్రిత్వమో మరే ఇజం గురించో కాదు. ఆ విధేయతా మార్గమే, ఆ శాంతి బాటయే ఇస్లాం. ఆ విషయానికొస్తే ప్రవక్తలందరి ధర్మం కూడా ఇస్లామే. వారందరూ ముస్లిములే. ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

"ఏ ధర్మాన్ని స్థాపించమని అల్లాహ్ నూహ్‌కు ఆజ్ఞాపించాడో ఆ ధర్మాన్నే మీ కొరకు నిర్ధారించాడు. దానినే (ఓ ముహమ్మద్-స!) నీ వైపునకు (వహీ ద్వారా) పంపాము. దాని గురించే ఇబ్రాహీమ్‌కు, మూసాకు ఈసా (అ)కు కూడా తాకీదు చేశాము. ఈ ధర్మాన్నే నెలకొల్పాలని, అందులో చీలిక తీసుకురావద్దనీ (వారికి) ఉపదేశించాము".(షూరా:13)

ఇదే విషయాన్ని ప్రవక్త మహనీయులు (స) వారు ఇలా ఉద్బోధించారు: **"ప్రవక్తలసమూహం సవితి సంతానం వంటిది. వారి తల్లులు (ధర్మ శాస్త్రాలు) వేరు, కాని వారి ధర్మం మాత్రం ఒక్కటే".** (బుఖారి)

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) జీవితంలో మనకు లభించే కొన్ని పాఠాలు -

1) ధర్మం వారసత్వంగా వస్తుందా?

ధనం, ఐశ్వర్యం, పొలం వారసత్వంగా లభించవచ్చేమోగానీ, ఇస్లాం మాత్రం వారసత్వంగా లభించేది కాదు. దేవుని కృపా కటాక్షాలతోపాటు దాన్ని మనిషి అన్వేషించి, శోధించి సాధించుకోవాలి. అధిక శాతం మంది ప్రవక్తలు అవిశ్వాసుల ఇంట, బహుదైవారాధనా సమాజంలోనే జన్మించారు. అలా జన్మించిన వారిలో ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ఒకరు.

ఆయన తత్వం వేరు. ప్రతి విషయాన్ని నిశిత దృష్టితో తరచి చూడటం ఆయనకు అలవాటు. మనిషి స్వహస్తాలతో చేసిన ప్రతిమల ముందు వంగటం, సూర్యచంద్ర నక్షత్రాల ముందు మోకరిల్లడం, అల్పాతి అల్ప ప్రాణులకి అలౌకికానందంతో హారతులు పట్టడం, భక్తీపారవశ్యాలతో చేతులు జోడించి నిలబడటం ఆయనకు మింగుడుపడలేదు. తన మీద వాలే ఈగను సయితం తోలుకొలేని విగ్రహాల ముందు రకరకాల నైవేద్యాలతో మొక్కుబడులు, ముడుపులు చెల్లించుకోవడం ఆయనకు హాస్యాస్పదంగా తోచింది. మనిషి మృగమై, అక్షరాలా అధర్మం నాలుగు పాదాలా నర్తించడం ఆయనకు సహించలేదు. అగ్ర వర్ణం, అధమ వర్ణం, పంచమ వర్ణం అంటూ అంట రానితనం, అస్పృతలనే విష గుళికల్ని జన స్రవంతిలో చల్లి దళిత ప్రజల శ్రమను సొమ్ము చేసుకుంటూ, వారి శ్రమను సంపదగా మార్చుకుంటూ, వారిని అన్ని విధాలా అణిచివేయడం, అది గ్రహించలేని స్థితిలో తమ జాతి ప్రజలు ఉండటం ఆయనకు నచ్చలేదు. రాజ్యాధికారులు తమని తాము దైవాంశ సంభూతులుగా ప్రకటించుకొని, ప్రజలందరూ తమకే తల వంచేలా చట్టాన్ని సవరించుకొని నియంతృత్వాన్ని, నిరంకుశత్వాన్ని కొనసాగించడం ఆయనకు జీర్ణం కాలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే తన తండ్రి లాంటి అనేకులు పీఠాధిపతులుగా చెలామణి అవుతూ సమాజాన్ని రోగగ్రస్తం చేయడం ఆయనకు బొత్తిగా నచ్చలేదు. మనిషి మూఢ నమ్మకాల గాఢాంధకార లోయల్లో పడి లేవలేని, కాంతికి కళ్ళు తెరవలేని స్థితిలో ఉండటం గమనించిన ఆయన చలించిపోయారు. వీటన్నింటి కారణాలు, కారకాలు ఏమిటి? అని ఆలోచించారు. సత్య శోధన చేశారు, సత్యాన్వేషణ జరిపారు. అసలు సత్యాన్ని చేరుకున్నారు. స్వీకరించారు. అమలు పర్చారు. ఉద్యమించారు. అదే ప్రజలకు బోధించారు. తన జీవిక కోసం తోడ్పడే సూర్యచంద్ర నక్షత్రాల్ని కాక, తన లాంటి మనుషుల్ని కాక, తన స్వహస్తాలతో చేసిన ప్రతిమల్ని కాక, వాటన్నింటి సృష్టికర్త ముందు తల వంచడమే వీటన్నింటికీ ఏకైక పరిష్కారంగా ఆయన తలిచారు. ప్రజలను సృష్టితాల దాస్యం నుండి విడిపించి సృష్టికర్త దాస్యంలో ఓలలాడేలా చెయ్యాలనుకున్నారు. ఆ మార్గంలోనే ఆయన అహర్నిశలు పరిశ్రమించారు కూడా.

దీన్ని బట్టి అర్థమయ్యేది ఏమిటంటే- మనం ముస్లింల ఇంట పుట్టామా, క్రైస్తవుల ఇంట పుట్టామా, యూదుల ఇంట పుట్టామా, హిందువుల ఇంట పుట్టామా అన్నది ఇక్కడ చర్చనీయాంశం కాదు. ఎందుకంటే పుట్టుక - మరణాలు మన చేతిలో లేవు కాబట్టి. కాకపోతే ఈ రెండింటికి మధ్యనున్న జీవిత కాలం ఎలా జీవించాలి? విధేయులుగా జీవించాలా? అవిధేయులుగా జీవించాలా? విశ్వాస ఉత్తమ స్థితిలో మరణించాలా? అవిశ్వాస స్థితిలో కళ్ళు మూయాలా - ఇది మాత్రం మనమే నిర్ణయించుకోవాలి. ఒకవేళ మనం అవిశ్వాసుల ఇంట జన్మించి ఉంటే అది మన తప్పు కాదు. అందుకు మనము ఖేద పడాల్సి అవసరమూ లేదు. అయితే అవిశ్వాసులుగానే మరణించటం, సత్యం ఇదని తెలిసి కూడా మారకపోవడం ఖచ్చితంగా మన తప్పే అవుతుంది. తర్వాత తీరిగ్గా కూర్చొని చింతించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. అలాగే ఒకవేళ మనం విశ్వాసుల ఇంట జన్మించి ఉంటే ఉబ్బితబ్బిబ్బవడమూ సముచితం కాదు. ఎందుకంటే ప్రవక్తలంతటి పుణ్య పురుషుల, పరిశుద్ధ వ్యక్తుల కడుపున పుట్టిన వారు సయితం తమ వెకిలి చేష్టల, వెర్రి పోకడల వల్ల నరకవాసుల జాబితాల్లో చేరిపోయారు. కాబట్టి ఎక్కడ పుట్టామన్నది కాదు ముఖ్యం, సత్య మార్గంలో జీవించామా అన్నది ముఖ్యం. ఇదే విషయాన్ని ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) మరియు ప్రవక్త యాకూబ్ (అ) తన సంతానానికి బోధించారు.

"ఈ ఉపదేశమే ఇబ్రాహీమ్ మరియు యాకూబ్ తమ సంతానానికి చేశారు. వారిలా అన్నారు: "నా బిడ్డలారా! అల్లాహ్ మీ కోసం ఈ (శాంతి విధేయతల) ధర్మాన్నే ఇష్ట పడ్డాడు. కనుక మీరు ముస్లిములుగా తప్ప మరణించకూడదు సుమా! (మీకు విశ్వాసస్థితిలోనే మరణం రావాలి సుమా!)".
(బఖర: 132)

2) దేవుని కటాక్షంతోనే సన్మార్గ భాగ్యం

అవును, మనిషిలో సత్యార్తి రగలాలి. మనిషి సత్యాన్వేషిగా మారాలి. అజ్ఞానం, దీనత్వం, భావ దారిద్ర్య సంకెళ్ళను తెంచే జ్ఞానవంతుడిగా, విజ్ఞానవంతుడిగా, ధీరుడిగా ఎదగాలి. అప్పుడే మనిషిలోని ప్రజ్ఞాపాటవాలు వెలుగు చూస్తాయి. అప్పుడే దైవ కటాక్షం తోడై సన్మార్గ భాగ్యం లభిస్తుంది. మనిషి జీవిత లక్ష్యం సిద్ధిస్తుంది. ఈ సృష్టి, సృష్టిలోని సమస్తమూ అల్లాహ్‌దే. చూసేందుకు, చర్మచక్షువులతో పాటు ఆత్మ చక్షువులుండాలేగాని కానవచ్చే కథలెన్నో! వినవచ్చే పాఠాలు, గుణపాఠాలు ఎన్నో!! అర్థం చేసుకునేందుకు మెదడుతోపాటు ఆస్వాదించే మనసుండాలేగాని సత్యోపదేశ జలధారలు, అమృత కలశాలెన్నో!!

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"నమ్మేవారికి భూమిలో పలు నిదర్శనాలున్నాయి. స్వయంగా మీ ఆత్మలలో (అస్థిత్వంలో) కూడా (ఎన్నో నిదర్శనాలు) ఉన్నాయి. మరి మీరు పరిశీలనగా చూడటం లేదా?".

(జారియాత్: 20, 21)

నేడు అన్ని రంగాల్లోనూ విజయ కేతనాన్ని ఎగుర వేస్తున్న మానవుడు, శాస్త్రవేత్తగా, ఆర్థికవేత్తగా సన్మానాలు అందుకుంటున్న మానవుడు నిజ దైవాన్ని తెలుసుకోలేకపోతున్నాడు. కారణం–పదార్థ పూజ, తన మేధ చెప్పింది, తన ఇంద్రియ పరిధిలోకి వచ్చింది మాత్రమే నిజం, తక్కినవన్నీ మిథ్య అన్న అహం. ఫలితం–ఆమ్ ఆద్మీ, సామాన్య మనిషి నిజ దైవాన్ని గుర్తించగలుగుతున్నా– డిగ్రీలు, పట్టాలు పుచ్చుకున్న అనేక మంది మాత్రం ఈ భాగ్యానికి దూరంగా జీవిస్తున్నారు. **'అడగనిదే అమ్మ కూడా పెట్టదు'** అన్నట్టు మనిషిలో సత్యార్తి లేనిదే అల్లాహ్ కూడా అతనికి సన్మార్గం చూపడు. ఆయన ఇలా సెలవిస్తున్నాడు: **"ఏ జాతి అయినా సరే స్వయంగా తన మనోమయ స్థితిని మార్చుకోనంత వరకూ అల్లాహ్ కూడా దాని స్థితిని మార్చడు".** (రాద్: 11)

ఏ సూర్యచంద్రనక్షత్రాల పరిశోధనతో నేటి మానవ ప్రగతి అంబర అంచుల్ని తాకుతున్నదో, ఒకప్పుడు అవే సూర్యచంద్ర నక్షత్రాలను చూసి వాటిని రూపకల్పన చేసిన అల్లాహ్ ను కనుగొన్నారు ప్రవక్త ఇబ్రాహీమ్(అ). జ్ఞానోదయం అనంతరం ఆయన ఇలా ప్రకటించారు:

"ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్‌కు మీరు కల్పించే భాగస్వాములతో నేను విసుగెత్తిపోయాను. వాటితో నాకెలాంటి సంబంధం లేదు". (అన్‌ఆమ్: 79)

"నిశ్చయంగా నేను ఆకాశాలను, భూమిని సృష్టించిన ఆ సృజనశీలుని వైపుకు ఏకాగ్రతతో నా ముఖాన్ని తిప్పుకుంటున్నాను. నేను షిర్క్ (బహుదైవారాధన) చేసేవారిలోని వాణ్ణి మాత్రం కాను". (అన్‌ఆమ్: 79)

3) అకుంఠిత దీక్ష, అవిరళ కృషి ఉంటే సమాజంలో మార్పు సాధ్యమే

సంఘ సంస్కరణ రంగానికి మూల పురుషులు ప్రవక్తలు. అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు, దౌష్ట్యాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలపై తిరుగుబాటు ప్రకటించిన ఆద్యులు ప్రవక్తలు. మాయామబ్బులు క్రమ్మి మార్గం కానరాక అయోమయ స్థితిలో పడి కొట్టుమిట్టాడే జనవాహినికి సత్య వెలుగుల్ని ప్రసాదించిన కాంతికారులు, క్రాంతి వీరులు, శాంతి రూపులు ప్రవక్తలు. సృష్టితాల దాస్య శృంఖలాలను త్రెంచి, అనవసర ఆంక్షల బరువును మానవ భుజాల మీద నుండి దించి, సృష్టికర్తను ఆరాధించమని పిలుపు ఇచ్చిన ఆ పుణ్య పురుషుల, పరమ శ్రేయోభిలాషుల, మానవ మహోపకారుల సంఖ్య 1 లక్ష 24 వేల మంది కాగ, వారిలో 315 మంది రసూల్ (దైవ దౌత్యంతోపాటు ధర్మ శాసనం అనుగ్రహించబడిన ప్రవక్తలు) అవగా, వారిలో 5 మంది వజ్ర సంకల్పం గల ప్రవక్తలు.

1) ప్రవక్త నూహ్ (అ) – తన జాతి వారిని 950 సంవత్సరాలు సత్యధర్మం వైపు పిలుస్తూనే ఉన్నారు.

2) ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) – ఎన్ని అడ్డంకులు ఎదురయినా, ఎన్ని ప్రతికూల పవనాలు వీచినా, భగభగమండే నిప్పుల్లో నెట్టేసినా, ఊరి నుండి గెంటేసినా ఆయన మాత్రం ప్రజల మేలు కోరుతూ అల్లాహ్ మార్గం వైపు వారిని ఆహ్వానిస్తూనే ఉన్నారు.

3) ప్రవక్త మూసా (అ)–అగ్రవర్ణం అని చెప్పుకుని బీరాలు పోయే ఖిబ్తీలు, కృషి వలుల్ని, శ్రమజీవుల్ని బానిసలుగా చేసే నిరంకుశ పాలనాధికారులపై యుద్ధాన్ని ప్రకటించిన ధీరోదాత్తులు. గోవును కాదు, గోవును పుట్టించిన అల్లాహ్‌ను ఆరాధించమని జాతికి హితోపదేశం చేసిన శాంత రూపులు ఆయన.

4) ప్రవక్త ఈసా (అ) – ప్రజలు ఆయన్ను హింసించినా, చెరసాల్లో బంధించినా, ముళ్ళ కిరీటం తొడిగించి వేధించినా, బాధించినా, పారదర్శకతే ప్రధానంగా భావించి వారిని అల్లాహ్ మార్గంలో నడిపించేందుకు పట్టువీడని విక్రమార్కునిలా పరిశ్రమించారు.

5) అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) – గత ప్రవక్తలందరి కాలాల్లో ఉన్న దౌర్జన్యాలన్నీ ఆయన ఒక్కరి హయాంలోనే ఉన్నా విసుగు చెందక ఎంతో ఓర్పుతో, నేర్పుతో ప్రజల్లో సత్య చైతన్యాన్ని తీసుకు వచ్చి, మానవ చరిత్రే కని, విని, ఎరుగని గొప్ప ఆదర్శ సమాజాన్ని స్థాపించి ప్రవక్తలందరిలో అగ్రజులుగా ఖ్యాతి పొందారు.

సోదరులారా! ఈ దారి మన కోసం అపరిచితమైనది కాదు. ప్రవక్తలందరూ, పుణ్య పురుషులందరూ నడిచిన దారియే. ఇది ఎంత సనాతనమో అంతే వినూతనం కూడా. కనుక చీకటి దట్టంగా ఉందే అని బాధ పడటం, భయ పడటం మాని ఒక్క చిరు దీపం వెలిగించేందుకు ప్రయత్నించండి. చీకటి దానంతట అదే తొలిగిపోతుంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

"వజ్ర సంకల్పం గల ప్రవక్తలు సహనం వహించినట్లు నీవూ సహనం వహించు. వారి విషయంలో తొందర పెట్టకు".

(అహ్‌ఖాఫ్: 35)

ఈ జీవన పయనంలో విజయంతోపాటు వైఫల్యాలూ ఉన్నాయి. ఆశాసౌధాలతో పాటు ఆశాభంగాలూ ఉన్నాయి. కాని దారి తప్పిన ప్రతి సారి ప్రవక్తల జీవితాలు మనకు మార్గదర్శకం కావాలి. ఖుర్‌ఆన్ మనకు వెలుగు బాటగా నిలవాలి. గమ్యం చేరుకోవాలన్న దీక్ష గల బాటసారి అలుపెరగడన్న వాస్తవం అర్థం చేసుకోవాలి. ఈ కార్యసిద్ధికై దీక్ష, దుఆలతో పాటు అల్లాహ్‌పై ప్రగాఢమైన విశ్వాసం ఉండాలి. లక్ష్యం ఛేదించగలమనే ఆత్మ విశ్వాసంతోపాటు లోపాలను దిద్దుకునే గుణం అలవడాలి. సజ్జనుల సాంగత్యం కోసం ఆరాట పడాలి. నిత్యం శుభాత్మల్ని అన్వేషిస్తూ ఉండాలి. అంతర్గత శక్తుల్ని సరిగ్గా అంచనా వేయగల్గటం, జ్ఞానాభివృద్ధి కోసం అవసరమైన మార్గాన్ని అవలంబించడం అనేవి తప్పనిసరి విషయాలు. ఈ మార్గంలో ప్రశంసల జల్లూ కురుస్తుంది. విమర్శల బురదా చల్లబడుతుంది. పొగడ్తకు పొంగి పోకూడదు – అది అహానికి దారి తీస్తుంది. విమర్శకు కృంగిపోకూడదు – అది మన శక్తియుక్తుల్ని నిర్వీర్యం చేస్తుంది. ఒకరి ప్రశ్నకు సమాధానంగా మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (ర) గారు ఇలా అన్నారు:

'ఎవరైతే దైవ ధర్మం కోసం నన్ను ప్రేమిస్తున్నారో అల్లాహ్ వారికి మంచి ప్రతిఫలాన్ని అనుగ్రహించుగాక! దూషణలు, తిట్లు తిని నేను ముఖం చిట్లించుకోనప్పుడు తమరెందుకు అకారణంగా బాధ పడుతున్నట్లు!? నేను దూషణలు వింటాను, చదువుతాను; ఆ తర్వాత వాటిని ఓ ప్రక్కన పడేసి నా పని నేను చేసుకుపోతాను. మళ్ళీ అటుగా దృష్టి మరలించను. (నాకు పూర్తి నమ్మకం ఉంది.) దేవుడు నాకిచ్చిన కీర్తిని ఎవరూ నా నుంచి వేరు పర్చలేరు. అలాగే నాకు లేని ప్రతిష్టను ఎవరూ నాకు ఇవ్వజాలరు".

మరో సందర్భంగా ఆయన కార్యకర్తల్ని ఉద్దేశించి ఇలా హితోపదేశం చేశారు:



(ఇంకా ఉంది)

క్యా...న్స...ర్



ఈ మూడక్షరాల్ని తలచుకుంటే మృత్యువు కళ్ళ ముందు మెదులుతుంది. ఆ పేరు పలుకుతున్నా...గుండెల్లో దడ, పెదాల్లో తడబాటు, స్వరంలో మార్పు. కారణం....అపోహలు, అనుమానాలు, అవగాహనా రాహిత్యం. క్యాన్సర్‌ను ఎదిరించి నిలవడం సాధ్యమే. పోరాడి గెలవడం సాధ్యమే. అది మన దరిదాపుల్లోకి కూడా రాకుండా చుట్టూ దుర్భేధ్యమైన కోట కట్టుకోవడమూ సాధ్యమే. అదెలాగో తెలుసుకుందాం రండి! - ఈనాడు దిన పత్రికకు కృతజ్ఞతలతో....

క్యాన్సర్ ఎందుకు వస్తుంది?

మనిషి శరీరంలో కణ విభజన ఓ క్రమ పద్ధతిలో నియంత్రితమవుతూ ఉంటుంది. అవసరమైన చోట, అవసరమైన మేరకే విభజన జరుగుతుంది. కొన్నిసార్లు ఆ విభజన దారి తప్పుతుంది. లెక్కలేనన్ని కొత్త కణాలు పుట్టుకొచ్చి, ఓ పెద్ద సమూహం ఏర్పడుతుంది. అదే పెద్ద **'కణితి'**లా తయారవుతుంది. చుట్టూ ఉన్న ఆరోగ్యవంతమైన కణాల్ని కూడా మింగేస్తూ విస్తరిస్తుంది. అదే క్యాన్సర్. ఆ లక్షణాల్ని ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది. శరీరంలో ఏ భాగంలో అయినా ఈ దాడి జరగవచ్చు. రెండు కారణాల వల్ల ఇలాంటి మార్పు సంభవించవచ్చు.

1) జన్యుపరమైన లోపాలు, శరీర వ్యవస్థలో వైఫల్యాలు..మొదలైన అంతర్గత పరిస్థితుల ప్రభావం వల్ల ఇలా జరగవచ్చు. దాదాపు 25 శాతం క్యాన్సర్లు ఇలాంటి కారణాల వల్ల వస్తాయి. వీటి మీద మనకు నియంత్రణ ఉండదు.

2) బాహ్య పరిస్థితుల ప్రభావం. దాదాపు 75 శాతం క్యాన్సర్ రోగాలకు మనం, మన అలవాట్లు, మన చుట్టూ ఉన్న వాతావరణమే కారణం. తగిన జాగ్రత్తలు తీసుకుంటే, ఆ ప్రభావాన్ని తప్పించుకోవడం అసాధ్యమేమి కాదు.

అవగాహనాలేమి

భారత్‌లో ఏటా పది లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. నోరు, గొంతుం ఊపిరిత్తులు, ప్రోస్టేట్, మెదడు, జీర్ణాశయం, గర్భాశయ ముఖద్వారం, థైరాడ్, గాల్ బ్లాడర్ ...ఒకటేమిటి శరీరంలోని ఏ భాగం మీద అయినా క్యాన్సర్ దాడి చేసే అవకాశం ఉంది.

అసలే ఆరోగ్య స్పృహ అంతంత మాత్రంగా ఉన్న దేశం మనది. దీంతో క్యాన్సర్ విస్తరణకు అడ్డూ అదుపూ ఉండటం లేదు. 70 శాతం రోగులు జబ్బు పూర్తిగా ముదిరిపోయిన దశలోనే వైద్యుల్ని ఆశ్రయిస్తున్నారు. క్యాన్సర్ అంటే అపగాహన లేకపోవడం, రేడియోషన్ లాంటి చికిత్సా విధానాలంటే భయం, సమస్యే మిటో చెప్పుకోలేని బిడియం, భరించలేనంత ఖరీదై పోయిన వైద్యం...ఇలా భారత దేశంలో క్యాన్సర్ విజృంభణకు ఎన్నో కారణాలు. పరిస్థితులు ఇలానే కొనసాగితే, అవగాహనా రాహిత్యం అదే స్థాయిలో రాజ్యమేలితే... ఇంకో పదేళ్ళలో క్యాన్సర్ నరహంతక వ్యాధుల జాబితాలో పైభాగాన ఉంటుంది. యుద్ధంలో గెలవడం గొప్పే, యుద్ధం లేకుండా గెలవడం ఇంకా గొప్ప. ఇది ఎలా సాధ్యం? అంటే, నిపుణుల సహకారంతో, అధునిక వైద్య విధానాల సాయంతో ఆ ప్రభావం నుంచి బయట పడగలం.

మీ రాక శుభప్రదం మీ పొగ హాని కరం

'పొగ త్రాగడం ఆరోగ్యానికి హానికరం. అది లాంగ్ క్యాన్సర్‌కి దారి తీయవచ్చు' అన్న స్లోగన్ మనకు ప్రతి సిగరెట్ ప్యాక్ మీద దర్శనమిస్తుంది. దీన్ని బట్టే తెలుస్తుంది – ఆయా కంపెనీలకు ప్రజా ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ ఉందో. **'సిగరెట్ ఒక వైపు నిప్పు ఉంటుంది. మరో వైపు మూర్ఖుడు ఉంటాడు'** అన్న మాట అక్షరాలా నిజం. కోరి కోరి ప్రాణాంతకమైన క్యాన్సర్ బారిన పడే వారిని మూర్ఖులు కాదు, పరమ మూర్ఖులు అనాలి. ఏదో ఒక రోజు బంగారు వన్నె దబ్బా శవ పేటికలా మారిపోతుంది. పొగలు గక్కే సిగరెట్టు కాటికి దారి తీస్తుంది. ఊపిరి తిత్తులు, నోటి క్యాన్సరే కాదు – గర్భ సంచి, మూత్ర కోశం, కిడ్నీ – పొగాకు దుష్ప్రభావం మొత్తం శరీరమంతా విస్తరిస్తుంది. ఏటా దేశంలో పది లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతుంటే, అందులో మూడు లక్షల మంది పొగాకు పీడితులే. సిగరెట్టు, బీడి, గుట్కా లాంటివి క్యాన్సర్‌ను నిరోధించే జన్యువుల్ని నిర్వీర్యం చేస్తాయి. ప్రాణాంతక వ్యాధికి ఎర్ర తివాచీ పరుస్తాయి.



కుటుంబాన్ని ప్రేమించేవారు పొగాకును ద్వేషిస్తారు

మనిషికి మినహా ఇతర ఏ జీవికి తెలియని వ్యసనమిది. పేరుకు 'ఒక' సిగరెట్టే అయినా ... అందులో నాలుగు వేల పదార్థాలుంటాయి. దేనికదే ప్రమాదకరం. క్యాన్సర్ మోనాక్లైడ్ (కారు పొగ గొట్టంలోంచి వెలువడే కాలుష్య సంబంధమైంది), అమ్మోనియా (టాయిలెట్ క్లీనర్‌లో వాడతారు), ఆర్సెనిక్ (ఎలుకల మందులో కలుపుతారు).. మచ్చుకు కొన్ని. అలాగే మద్యం ప్రభావమూ తక్కువేం కాదు. దాదాపు మూడు శాతం కాన్సర్ రోగాలకు అదే కారణం. మద్యం త్రాగుతూ గుప్పు గుప్పుమని పొగలు పదిలే సవ్యసాచుల్ని అయితే, మృత్యువు రెండు వైపుల నుంచీ తరుముకొస్తుంది.



దృఢ సంకల్పంతో పొగాకు వ్యసనాన్ని దూరం చేసుకోవచ్చు. మనల్ని ప్రేమించే వారినీ, మన మీదే ఆధారపడినవారినీ ఒక్క సారి తలచుకుంటే...సిగరెట్ వెలిగించాలన్న ఆలోచనే రాదు. నూటికి 80 శాతం కేసుల్లో ధూమపానం వారసత్వంగా మారే ప్రమాదం ఉంది. **'పరోక్ష ధూమపానం'** కారణంగా ఇంటిల్లిపాది ఇబ్బంది పడతారు.

(మిగతాది 20వ పేజీలో)

- తరచూ తలనొప్పి, దవడల నొప్పులుంటే,
- పెదాలు, చేతులు వణుకుతూ ఉంటే,
- మెడనొప్పి, నడుము, కండరాల నొప్పులుంటే,
- తల తేలిపోతున్నట్లు తిరుగుతున్నట్లుంటే,
- నోరు ఎండి పోతుంటే,
- ఉన్నట్టుండి భయం అనిపిస్తే, గుండె దడదడ కొట్టుకుంటే,
- అరచేతులు, అరికాళ్ళు చల్లబడితే, చెమటలు పట్టితే,
- తరచూ మూత్రానికి వెళ్ళాలనిపిస్తే,
- శ్వాసలో ఇబ్బంది ఉంటే,
- నిద్రలేమి వేధిస్తే, భీతిగొల్పే కలలొస్తే,
- ఒంటరివైపోయాను, ఎందుకూ పనికిరాను అన్న భావన వేధిస్తే,
- తరచూ ఏడ్పు వస్తున్నట్లుంటే,
- ఎప్పుడైనా ఆత్మహత్య ఆలోచనలొస్తే,
- తరచూ దెబ్బలు, చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతే,
- పనిలో లోపాన్ని కప్పిపుచ్చేందుకు తరచూ అబద్ధాలాడితే,
- సిగరెట్టు త్రాగడం, మద్యం సేవించడం, కాలక్షేపం కోసమని క్లబ్బులకు వెళ్ళి పేకాట ఆడటం వంటి అలవాట్లకు బానిసలయితే,
- అతిగా ఏదో ఒకటి, ముఖ్యంగా తీపి పదార్థాలు తినాలనిపిస్తే,
- అలసటగా, బలహీనంగా అనిపిస్తే,
- మలబద్ధకం లేదా విరోచనాల సమస్య ఉంటే,
- (బహిష్టులు)క్రైంగిక వాంఛ తగ్గిపోయిందని భావిస్తే,
- అమ్మాయి జుట్టు ఎక్కువగా రాలిపోతే,
- రుతుక్రమం సరిగ్గా ఉండకపోతే,
- చిన్నచిన్న విషయాలకు కూడా అతిగా స్పందిస్తే,
- ఇతరులతో మాట్లాడటంలో, భావాలను పంచుకోవటంలో ఇబ్బందిగా ఉంటే,
- అతిగా చేసిందే చేస్తే,
- మంచుగా తయారయితే,
- ఎప్పుడూ బయటకెళ్ళి, ఏదో ఒకటి షాపింగ్ చేస్తే... ఒత్తిడి ఉన్నట్లు లెక్క

– మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ

మానసిక ఒత్తిడిని జయించడం ఎలా?

అయితే ఒత్తిడి అందరిలోనూ ఒకే రకంగా ఉండదు. ఏది ఏమైనా ఒత్తిడి దీర్ఘకాలం నెలకొంటే, శరీరంలోని వనరులన్నీ తరిగి పోతాయి. ఫలితంగా రోగనిరోధక వ్యవస్థ బలహీన పడి డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు ముసురుకుంటాయి. గుండె జబ్బులు పెరుగుతాయి. దీర్ఘకాలిక ఒత్తిడి కొన్ని క్యాన్సర్లకూ కారణమవుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.



ఒత్తిడికి దారితీసే కొన్ని కారణాలు

- కుటుంబ సంబంధాల్లో విచ్ఛిన్నం.
- అందం,అంతస్తుల్లో పైకెదగాలన్న ఆతృత.
- పిల్లల విద్య, శిక్షణలో సమస్యలు.
- ఆర్థిక ఇబ్బందులు. అని మానసిక నిపుణులు అంటున్నారు.

అయితే ఒత్తిడికి విరుగుడు లేదా? ఒత్తిడి నుంచి ఉపశమనం పొందే మార్గాలు లేవా? జీవితంలో శాంతి, తృప్తి, ఆనందం ఆహ్లాదాన్ని పొందే మార్గం ఏది?... అని ఎంతో ఆతృతగా అడుగుతున్నారు. మానసిక నిపుణుల్ని ఆశ్రయిస్తున్నారు మానసిక బాధితులు. ఒత్తిడిని దూరం చేయడానికి జాగింగ్ నుంచి యోగా వరకూ, వ్యాయామం నుంచి మసాజ్ ల వరకూ మార్గాలెన్నో సూచిస్తుంది శాస్త్ర ప్రపంచం. దీర్ఘశ్వాస తీసుకోవాలని, సంగీతం వినాలని, హాయిగా నవ్వెందుకు ప్రయత్నించాలని, పెంపుడు జంతువులతో ఆటలాడాలని, పిక్నిక్‌లకు వెళ్ళాలని మానసిక శాస్త్ర వేత్తలు పేరొంటున్నారు. అద్భుతం! ఈ సూచనల్ని పాటించి ఎంత మంది మానసిక రుగ్మతల నుండి ఉపసమనం పొందుతున్నారు?

మనిషి భౌతిక స్థాయి నుంచి ఉన్నతంగా ఎదిగి జీవించినప్పుడే జీవితంలో తృప్తి, శాంతి, ఆనందం, ఆహ్లాదం ఉంటాయి. రండి మానవ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ఉపద్రవం నుండి ఉపశమనం పొందే కొన్ని మార్గాలను దివ్య ఖుర్‌ఆన్ మరియు అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధనల వెలుగులో తెలుసుకుందాం.

దైవనామ స్మరణ, దైవాజ్ఞలపాలన

మనిషిని శారీరకంగానూ, మానసికంగానూ తొలిచేస్తున్న అశాంతి, అలజడి దూరం కావాలంటే దైవనామస్మరణ చేస్తూ ఉండాలి. దైవాజ్ఞలనుగుణంగా జీవించాలి.

"తెలుసుకోండి ! అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తి, శాంతి, నెమ్మది ప్రాప్తమవుతుంది". (13:28) అంటున్నాడు విశ్వ ప్రభువు అయిన అల్లాహ్.

ఉన్నత చదువులు, పెద్ద ఉద్యోగం, గొప్ప జీతం, అందమైన ఇల్లు, ఖరీదైన కారు, ఇవన్నీ ఉన్నంత మాత్రాన జీవితంలో సుఖం, సంతోషం ఉంటుందనుకుంటే పొరపాటే. విశ్వప్రభువు అంటున్నాడు:

"నా ఆజ్ఞల్ని ఉల్లంఘించిన వాడు ఎన్నడూ మనశ్శాంతికి నోచుకోడు". (20:124)

శ్రీ భగవద్గీత కూడా ఈ వాస్తవాన్ని ధృవీకరిస్తుంది. **"తమేవ శరణం గచ్ఛ సర్వ భావేన భారత తత్ప్రసాదాత్పరాం శాన్తిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్"** (18:62)

ఓ అర్జునా! సర్వవిధముల (సాటి సమానము లేని) ఆ సర్వేశ్వరునే శరణు బొందుము. ఆయన అనుగ్రహముచే సర్వోత్తమమగు శాంతిని శాశ్వతమగు మోక్షపదవిని నీవు పొందగలవు.

"యశ్శాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామకారత నస సిద్ధిమవాప్నోతి నసుఖం న పరాంగతిమ్" (16:23)

ఎవడు శాస్త్రోక్తమగు విధిని విడిచి పెట్టి తన ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించునో అట్టివాడు పురుషార్థ సిద్ధినిగాని, సుఖమునుగాని, ఉత్తమ గతియుదు మోక్షముగాని పొందలేడు. అవును మరి నిజస్వామిని, ఆ స్వామి ఆజ్ఞల్ని ధిక్కరించినవాడు కోటీశ్వరుడైనా అశాంతి అసంతృప్తితో బాధపడతాడు.

అనుబంధాల ప్రాముఖ్యత

సంఘజీవనంలో కుటుంబ వ్యవస్థకు చాలా ప్రాముఖ్యత ఉంది. తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు, ఆత్మబంధువులు



అంతా పరస్పరం ప్రేమానురాగాలు కలిగి ఉంటూ ఒకరినొకరు తోడుగా ఉండటంలో ఆనందం, తృప్తి ఎంతైనా ఉంటుంది. **"అండ లుంటే కొండలు దాటవచ్చ"**ని సామెత ఉంది. ఆపదల్లో నేనున్నానని అండగా నిలిచే కుటుంబ సభ్యులు తోడుంటే మనిషి నిశ్చితంగా ఉండగలుగుతాడు. ఆత్మ పీడన నుండి, మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొంద వచ్చు. అయితే డబ్బుజబ్బు సోకినప్పటి నుంచి కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయతానురాగాలు తగ్గిపోయాయి. నాలుగు గోడల మధ్య పలకరించేవారు కరువయ్యారు.

అంతిమ దైవప్రవక్త(స) ఎప్పుడో నొక్కి చెప్పారు: **"బంధువులు స్నేహితులు పరస్పరం ఆప్యాయతగా వ్యవహరించాలని, వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించాలని, కానుకలు ఇచ్చి పుచ్చుకుంటూ ఉండాలని, సుఖదుఃఖాలలో పాలు పంచుకుంటూ ఉండాలని,"** ఎందుకంటే మానసిక ఒత్తిడిని అధికమించాలంటే కుటుంబ సభ్యుల మధ్య సత్సంబంధాలుండాలి అని మానసిక శాస్త్రవేత్తలూ అంటున్నారు.

"ఇతరులతో సత్సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండటం ద్వారా మానసిక సమతుల్యతను సాధించవచ్చు"

– డాక్టర్ ఎస్.ఆర్.ఆర్.వై శ్రీవినాస్

డబ్బుందన్న అహంభావంతో, లేక ఎవరో ఏదో అన్నారని కసిని పెంచుకొని బ్రతికే వారికి తృప్తి, ఆనందం కరువైపోతుంది. ద్వేషమును తృంచి ప్రేమను పెంచేవారికి, కూటికి కరువై కుమిలే వారికి తోడునీడగా ఉండే వారికి శాంతి, సుఖాలు ప్రాప్తమవుతాయి.

డబ్బే సర్వం కాదు

ప్రపంచం డబ్బు చుట్టూ తిరుగుతుంది అంటుంటారు జనులు. డబ్బుంటే చాలు అన్నీ ఉన్నట్లే. అన్ని సౌఖ్యాలు వాటంతటవే వెతుక్కుంటూ వస్తాయి అని చాలా మంది భావిస్తారు. కాని **"డబ్బుంటే సుఖం దక్కుతుందేమోగానీ సంతోషం కాదు"** అన్నది అక్షర సత్యం. డబ్బు పిచ్చి ఒక్కొక్కసారి మనుషుల మధ్య అగాధాలు సృష్టించి పగలూ సెగలూ రేపుతుందని వివరించాడో పూర్వ కవి.

ప్రాణమిత్రుడైన పగవాని జేయు
నరమి ప్రాణమీద నలుగు జేయు
కొరగాని కతిలోభ గుణము బుట్టగజేయు
తోడబుట్టిన వాని దొలగ జేయు.



చెన్నైలోని ఓ –ఐటి కంపెనీలో పనిచేసే 26 ఏళ్ళ వర్ష అంటుంది **"నేనూ, నా భర్త కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. ఇద్దరం బాగా సంపాదిస్తున్నాం. కానీ జీవిత మాధుర్యాన్ని ఆస్వాదించే తీరికే మాకు లేదు. మేమిద్దరం పేరుకు ఒకే ఇంట్లో ఉంటాం. కానీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం ఉండదు. ఆదివారం నాడు కూడా ఇంట్లో ఆఫీసు పని చేసుకోవాల్సి వస్తుంది. అది పూర్తయ్యేసరికి మానసికంగా చాలా అలసిపోతాం"** అని (ఉద్యోగం వివాహ నాశాయ! ఈనాడు 23/07/2007)

డబ్బు...డబ్బు...డబ్బు...డబ్బే జీవిత లక్ష్యంగా భావించి, దాని కోసం నిరంతరం శ్రమించి, శారీరంగా మానసికంగా కుమిలి డిప్రెషన్‌కు గురై ఎన్ని జీవితాలు అంతమయ్యాయో?! విశ్వప్రభువు అంటున్నాడు:

"వారి సిరిసంపదలనూ, వారి అధిక సంతానాన్నీ చూసి మోసపోవద్దు. అల్లాహ్ మాత్రం ఈ సిరిసంపదల ద్వారానే వారికి ప్రాపంచిక జీవితంలో కూడా శిక్షకు గురి చెయ్యాలని, వారు ప్రాణ త్యాగం చేసినా సత్య తిరస్కార స్థితిలోనే చెయ్యాలని కోరుతున్నాడు".

(9:55)

డబ్బు జీవితావసరం. జీవిత లక్ష్యం కాదని తెలుసుకుంటే ఒత్తిడి నుంచి బయటపడవచ్చని అధ్యాయనాలు చాటి చెబుతున్నాయి.

సంతానం దేవుని వరం



"ఒకప్పుడు ఎక్కువ మంది వద్దు. ఒకరు లేక ఇద్దరు చాలు. వాళ్ళను చక్కగా పెంచాలి. మంచి చదువు చెప్పించాలి. నలుగురిలో ఉన్నప్పుడు వాళ్ళు ఎవరికీ తీసిపోకూడదు. చిన్నప్పుడు మేం ఎదుర్కొన్న ఇబ్బందులేవీ మా పిల్లలకు ఎదురు కాకూడదు" ఇది సగటు తల్లిదండ్రుల ఆలోచన. ఇప్పుడు ఏక సంతానంపై మొగ్గు చూపే వారి సంఖ్య పెరుగుతుంది. ఏక సంతానంపై ఆసక్తితో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. ఆపరేషన్ల గణాంకాల ప్రకారం 2007 జనవరి నాటికి రాష్ట్రంలో 50,792 జంటలు కు.ని. చేయించుకున్నాయి.

"నానేనికి మరోవైపు చూస్తే ఒకే బిడ్డ ఉన్న తల్లిదండ్రులు స్వయంగా ఆ బిడ్డ మానసిక బాధకు గురవుతున్నారు. ఎక్కడున్న తమదే పైచేయి కావాలనే భావనతోపాటు తమకు తోడు లేదన్న న్యూనతాభావం కూడా ఆ ఒకే బిడ్డలో ఉంటుంది" అని మనస్తత్వ శాస్త్రవేత్త జి. పద్మజ అంటున్నారు

(ఈనాడు 23/03/2008)

మరి కొన్ని కొత్త జంటలు కేరీర్ కోసం కానుపు వాయిదా వేస్తున్నారు, వారు స్థిర పడేసరికి వయస్సు మీరిపోయింది. ఇప్పుడు కావాలనుకున్న గర్భం రాదు... వచ్చినా నిలవదు. వయసు పెరిగే కొద్ది పిల్లలు పుట్టే అవకాశం తగ్గడమే కాదు పుట్టే పిల్లల్లో లోపాలు ఉండే అవకాశం కూడా ఎక్కువే అని హెచ్చరిస్తున్నారు ప్రముఖ గైనకాలజిస్ట్ రాధిక. (ఈనాడు 30/03/2008)

చిక్కుడు చెట్టుకు తీగలందమ్ము
కాకార పాదుకు కాయలందమ్ము
పడతికి పది నెలల బాలుడందమ్ము

మధ్య తరగతికి చెందిన దంపతులు తమ బిడ్డల్ని చూసి మురిసిపోతూ ఇలా పాడుకుంటారు:

పచ్చని చిలుకలు తోడుంటే
పాడే కోయిల వెంటుంటే
భోలోకమే ఆనందానికి ఇల్లోయి
లోకంలో కన్నీరిక చెల్లోయి.



కేరీర్‌లో నిలదొక్కుకోవాలని సంతానాన్ని కాంక్షించని వారికి జీవితాంతం విషాదం వెంటాడుతూ ఉంటుంది. అందుకే విశ్వ ప్రభువు అంటున్నాడు :

"పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి మేము వారికీ ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చేయడం మహా పాపం".

(17:31)

సయ్యద్ అబ్దుస్సలాం ఉఫ్రీ
abdussalamsyed@ymail.com

ప్రజా సంబంధాల ప్రాముఖ్యత

ధనము, యౌవనము, కీర్తిప్రతిష్ట, రాజ్యము, అధికారము అన్నియును అనిత్యములే. కాబట్టి సంగ్రహమును, పరిగ్రహమును పరిత్యజించి మన కు ప్రాప్తమయినున్న వాటిని పలువురికి పనికి వచ్చేలా కార్యాచరణ రంగాన్ని తయారు చేసుకోవాలి. మనకు లభ్యమయి ఉన్న సకల సంప దలను, శ్రమను, శక్తిని, బుద్ధిని, వివేకాన్ని, విజ్ఞానాన్ని దైవాదేశాల కను గుణంగా–ధర్మ, దేశ, ప్రజల అభ్యున్నతి కోసం వినియోగించి శాంతిని, ఆత్మ సంతృప్తిని, మనోల్లాసాన్ని పొందాలి. ఆత్మ స్తుతికి, ప్రశంసకి బాని సయి ఇతరుల్ని కించపర్చడం, ద్వేషించడం అనేది కడకు ద్విగుణీ కృతమై మనల్ని కడతేరుస్తుంది. మన దుఃఖానికి కారణభూతమవుతుం దన్న సత్యాన్ని సదా గుర్తు పెట్టుకోవాలి. మనల్ని మనం ప్రేమించినట్ల యితే అన్యుల్ని సయితం ప్రేమించడం నేర్చుకోవాలి. మన కోసం మంచిని ఇష్టపడినట్లే ఇతరుల మేలును సయితం కోరుతూ ఉండాలి. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:
"ప్రజలతో సంబంధాలు పెట్టుకో కుండా, వారి నుండి ఎదురయ్యే ఇబ్బందుల్ని ఓర్చుకొలేని విశ్వాసికన్నా, ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ వారి వల్ల కలిగే ఇక్కట్లను భరించేవాడే శ్రేష్ఠుడు". (తిర్మిజీ, ఇబ్ను మాజా)

ఇస్లాం ధర్మం వైరాగ్యాన్ని (రుహ్బానియ్యత్) బోధించదు. మనిషి సొంత స్వార్థం కోసం సంఘం నుండి పారిపోయి కొండల్ని, కోనల్ని, అడవుల్ని, ఎడారుల్ని ఆశ్రయించి (సర్వ సంఘ పరిత్యాగి) సన్యాసిలా జీవించమని ఆదేశించదు. పైగా మనిషి సంఘంలోనే ఉంటూ, దేవుని హక్కులతోపాటు, దాసుల హక్కుల్ని సయితం నిర్వర్తించడమే గొప్పతన మని అంటుంది. ధర్మాధర్మాల సంఘర్షణలో ధర్మోన్నతి కోసం పరిశ్ర మిస్తూ, అధర్మాన్ని సంఘం నుండి పారద్రోలడం అనేది శ్రేష్ఠ సము దాయ ప్రధమ కర్తవ్యంగా పేర్కొంటుంది. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించ మని, అభాగ్యుల్ని ఆదుకోమని, అనాథల్ని ఆదరించమని, వితంతు వుల, వికలాంగుల యోగక్షేమాల్ని గమనించమని, ప్రజలతో సత్సంబం ధాలు కలిగి ఉండమని, మంచిని ఆదేశించమని, పెంచమని, చెడును వారించమని, తుంచమని, అజ్ఞానం వల్ల అపమార్గం పాలైన అమాయ కులకు విజ్ఞాన దివ్వెలు అందించి ధర్మ మార్గాన నడిపించమని, ఏ ఒక్క రికి హాని తలపెట్ట వద్దని, ఇతరుల నుండి ఎదురయ్యే కష్టాలను ఓర్పు తో సహించి, పెద్ద మనస్సుతో క్షమించమని నొక్కి వక్కాణిస్తుంది ఇస్లాం. మహా ప్రవక్త (స) వారి జీవితంలో అడుగడుగునా ఈ ఆదర్శ ప్రవర్తనే దర్శనమిస్తుంది.

దైవ ప్రవక్త (స) ప్రజలతో కలిసిమెలిసి వారిలో ఒకరుగా ఉండేవారు. వారితోనే కలిసి కూర్చునేవారు, కలిసి భోంచేసేవారు. ప్రయాణావస్థలో భోజన తయారికై కట్టెలు ఏరుకొచ్చేవారు. మస్జిద్ నిర్మాణ సమయంలో స్వయంగా రాళ్ళు మోసుకొచ్చేవారు. కందకం త్రవ్వాల్సి వచ్చినప్పుడు అందరిలానే తానూ గడ్డపార తీసుకొని కష్టపడేవారు. యుద్ధం సంభ వించినప్పుడు చివరి క్షణం వరకు వారితోనే ఉండేవారు. కొన్ని విప త్తుర, విషయమ పరిస్థితులలో సహాబాలు వెన్ను చూపినా, **'నేను సత్య ప్రవక్తను – ఇందులో సందేహానికి తావే లేదు'** అంటూ ధీరశాంతాన్ని ప్రదర్శించేవారు. తోటి ప్రజల సుఖసంతోషాలలో, దుఃఖ కష్టాలలో పాలు పంచుకునేవారు. దుఃఖితులను ఓదార్చేవారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలకు సంతోషం కలిగితే ఆయన ఆనంద పడేవారు. ప్రజలకు కష్టాలు ఎదు రైతే ఆయన చలించిపోయేవారు. తన ఉత్తమ నడవడికతో, స్వచ్ఛమైన చిరునవ్వుతో ప్రజా హృదయాల్ని గెలుచుకున్న సుభక్తాగ్రేసరులు, మహా ఉదారులు, గొప్ప దానశీలురు, కరుణ స్వరూపులు ఆయన (స).

దైవ ప్రవక్త (స) ఎన్నడూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానం ఉండాలని, ప్రజల నుండి వేరయి తను గుర్తించబడాలని ఆశించలేదు. మార్గం మధ్య ఎదురయ్యే వ్యక్తులకు తానే ముందుగా సలామ్ చేసేవారు. దారిలో పిల్లలు ఎదురైతే వారికి సయితం తానే ముందు సలాం చేసే వారు. వారితో కలిసి కూర్చునేవారు. ప్రేమగా తల నిమిరేవారు. పిలల్ల పట్ల అవ్యాజానురాగాన్ని కనబర్చేవారు. కొత్త పంట (ఖర్జూరాలు, ఇతర ఫలాలు) చేతికందితే ముందు పిల్లలకే ఇచ్చేవారు. ఇంట్లో ప్రవేశించేట ప్పుడు, ఇంటి నుండి బయలుదేరేటప్పుడు కూడా తానే సలాం చెప్పే వారు. పరిచయస్తులతోనూ, అపరిచయస్తులతోనూ ప్రేమగా వ్యవహ రించేవారు. కొత్తపాత అన్న తేడా లేకుండా అందరితోనూ సమానంగా కరచాలనం చేసేవారు. చాలా రోజుల తర్వాత ఎవరైనా కలిస్తే, అతన్ని అమాంతంగా కౌగలించుకునేవారు. ఎవరైనా కరచాలనం చేస్తే స్వయం గా ఆ వ్యక్తి చెయ్యి వదలనంత వరకూ వదిలే వారు కాదు. ఎవరికైనా ఏదైనా సందేశం పంపదలచుకుంటే సలాం చెప్పి పంపేవారు. అలాగే ఎవరైనా దూరం నుండి సలాం చెప్పి పంపితే ఆనందించేవారు. బంధు వులకు, సహచరులకు, ఇరుగుపొరుగు వారికి అప్పుడప్పుడు కానుకలు అందజేసేవారు. తరచూ **"పరస్పరం ఒండొకరు కానుకలు ఇచ్చిపుచ్చు కుంటూ ఉండండి. తద్వారా మీ మధ్య ప్రేమానురాగాలు పెరుగు తాయి"** అని పురమాయిస్తూ ఉండేవారు.

ఏదైనా సమావేశానికి వెళ్ళవలసి వస్తే ఎక్కడ చోటు లభిస్తే అక్కడే కూర్చునేవారు. ప్రజల భుజాలు దాటుకుంటూ ప్రత్యేక స్థానం కోసం ప్రాకులాడేవారు కాదు. సహచరుల్లోని, సభికుల్లోని ఎవరైనా గౌరవార్థం లేచి నిలబడటాన్ని అసహ్యించుకునేవారు. ఎవరైనా మాట్లాడేటప్పుడు మధ్యలో కలుగజేసుకునేవారు కాదు. ఎదుటి వ్యక్తి చెప్పిందల్లా శ్రద్ధగా వినేవారు. జవాబు ఇవ్వవలసి వస్తే ఎంతో సౌమ్యంగా, సమంజసమైన రీతిలో సమాధానం ఇచ్చేవారు. ఎవరైనా ఏదైనా పని కోసం పిలిస్తే సిద్ధంగా ఉండేవారు. వ్యాధిగ్రస్తుల్ని వెళ్ళి పరామర్శించి వచ్చేవారు.



చేతనయినంత ఆర్థిక సహాయాన్ని అంద జేసేవారు. రోగగ్రస్తులతో ప్రేమగా పలుక రిస్తూ వారి స్వస్థత కోసం దుఆ చేసేవారు. కుష్ఠు రోగులతో సయితం కలిసి కూర్చుని భోంచేసేవారు.

ప్రజలకు ఏ ప్రమాదం వాటిల్లినా, ఏ విప త్తుర పరిస్థితి ఏర్పడినా తాను ముందుండి వారి బాగోగులను గమనించేవారు. ఎవరి కైనా జీవితపు చివరి ఘడియ సమీపించింది అని తెలిస్తే తక్షణం బయలుదేరి వెళ్ళి – **"పశ్చాత్తాపం చెందము"**ని హితవు పలికే వారు. అతని ఇంటివారికి ధైర్యం చెప్పే వారు. ఓర్పు సహనం కలిగి ఉండమని హితోపదేశం చేసేవారు. శవ సంస్కారాలు తొందరగా ముగియాలని అభిలషించేవారు. శవపేటికను తానే స్వయంగా మోసేవారు. జనాజా నమాజు చేయించేవారు. మరణిం చిన వ్యక్తి కోసం దుఆ చేయడమేకాక, అతని మీద అప్పు భారమేదైనా ఉంటే తీర్చేవారు.

అవసరార్థం తన దగ్గరకు వచ్చిన ఏ ఒక్కరి కి ఆయన **'లేదు'** అని అనలేదు. అప్పు రుణ భారం క్రింద నలిగే బీదసాదల అప్పును స్వయంగా తీర్చేవారు లేదా స్తోమత గల ఇత రులను తీర్చమని ప్రోత్సహించేవారు. అవ సరం అన్నిస్తే ఇరుగుపొరుగు వారి కోసం బజారు నుండి కూరగాయలు తీసు కొచ్చి ఇచ్చేవారు. ఆకలిగొన్నవారి ఆకలి తీర్చేవారు. బానిసల బంధ విముక్తి కోసం అహరహం పరిశ్రమించేవారు. సమాజంలోని అణగారిన వర్గాలను, దళిత జనాలను, పీడిత ప్రజలను ఉద్ధరించే ప్రణాళికలు రూపొందించేవారు. వారి అభ్యుదయానికై అహర్నిశలు కృషి చేసేవారు. ప్రజలతో నగుమోముతో పలు కరించేవారు. అప్పుడప్పుడు సహచరులతో కలిసి హాస్యాన్ని పండించేవారు. విల్లు విద్య పోటీల్లో, ఈత పోటీల్లో, పరుగు పందెంలో వారితో పాల్గొనేవారు. ఒక్క మాటలో చెప్పా లంటే, దైవప్రవక్త (స) సమాజానికి, సంఘా నికి, ప్రజానికానికి ఎంత దగ్గరగా జీవించా రంటే, ఆ సమాజపు ప్రతి వ్యక్తి–**"అందరి కన్నా ఎక్కువగా దైవ ప్రవక్త (స) నన్నే ప్రేమి స్తున్నారు"** అన్న గొప్ప అనుభూతిని పొందే వాడు. మహా ప్రవక్త (స) వారి ఈ ఆదర్శ ప్రవర్తన కారణంగానే అప్పటి ఆ సమాజం లో మునుపెన్నడూ కని,విని,ఎరుగని పరివర్త నం వచ్చింది. అదే నేడు మనందరి **'కల'** (విజన్) అయి నిలిచింది. ఆకలను సాకారం చేసుకునే దిశకు మన **'లక్ష్యం'** (మిషన్) సాగాల్సి ఉంది.



అదే అదే అరేబియా నేల!

చిన్నారిపొన్నారి పాపల్లారా! రండి!
రేపటి ఆశాదీపాల్లారా! రండి!
తరతరాల మణి నేల
తీరూ తెన్నులు చూడండి

ఆదం ప్రవక్త హితోక్తితో
పరపశించిన పవిత్ర పుడమి – మన
ఫారాన్ పర్వత ప్రాంతం
అదే మక్కా పట్టణం – ఆ
నగరానికే వన్నె తెచ్చినది
కాబా ప్రతిష్ఠాలయం – అది
నాటికీ ఏనాటికీ నిఖిల జగత్తుకి మార్గ
దర్శక కేంద్రం, అది ఎంతో సుందరం

మనోభీష్టను పసిడి గుళ్ళుగా మార్చు చల్ల
ని బహు మధురమైన ఊట బావి – మన
పాలిట ఓ దివ్య వరం
అదే జం జం జలం! ఆ సు
జలం సేవిస్తే సిద్ధిస్తుంది మనో
సత్సంకల్పం

ఏకేశ్వరోపాసనా పిలుపుకి పాదులు వేసిన
నిత్య నూతన ఉద్యాన వనం – ఉన్నత
విద్యాలయం, శాంతి ఆలయం
అదే అదే మస్జిదె హరామ్! ఆ
హరమె మక్కీలో రాతి గుండెలైనా
కరిగెను, జడ హృదయాలైనా ద్రవించెను
అచటి ఖుర్‌ఆన్ మృదు మధుర పారాయ
ణంలో విన్పించు సప్తస్వరాల సమ్మేళనం
తవాఫ్ సయీల ఆ దృశ్యం
ముగ్ధమనోహరం

ప్రవక్త వారు హిజ్రత్ చేసి
నవ సమాజ సంస్థాపనకు నాంది
పలికి భువన స్వర్గం
మదీనా పురం – ప్రవక్త
వారి సూక్తుల సౌరభాలు గుభాళించిన
పూవనం యస్రిబ్ పట్టణం
అదే అదే ప్రవక్త పరమపదించిన ధరిత్రి
శాంతి శ్రేయాలు పరిఢవిల్లిన
జీవధాత్రి

మదీనా పర్వతాలైనా
వినిపించును ప్రవక్త వారి నోట
జాలువారిన అమృత వాక్కులు
పులకించగ మనసులు
ఓ ఉహద్ పర్వతమా! మేము కూడా
నిన్ను ప్రేమిస్తున్నాము.

సరిలేరు నీకెవ్వరు

సరిలేరు నీకెవ్వరు–సకల లోక పాలకా!
సాటిలేరు నీకెవ్వరు భువనగగన పోషకా!
అవనీఆకాశాన–స్తోత్రగానములలో సరి
తూగరు నీకెవ్వరు క్షమాశీల దయాకరా!
గుణములోనగానీ – కళా నైపుణ్యములోన
గానీ

సృష్టిని నీ శక్తితో నిర్మించి
ప్రజలను నివశింపజేసినావు. వారు
మార్గం తప్పంగ – ప్రవక్తలను
పంపి–గ్రంథాలను అవతరింపజేసి–శాంతి
ని వెలయించి–మంచిని వెలిగించి–జగతిని
ప్రక్షాళించి–సత్యం స్థాపించినావు

నరుడే నీతిని వీడి–మార్గహీనులతో కూడి
తుచ్ఛ కోరికల వేడి–మనసు తప్పగ గాడి
విష సంస్కృతి తీండ్రించింది–విశ్వాన్ని
వినాశన కుంపటిలో నెట్టింది
అయినా విశ్వకర్త క్షమించాడు

క్షమాసాగరా! అఖండ జ్యోతీశ్వరా!
నిరపేక్షాపరుడా! నిత్య జీవుడా!
నీ వాణి హితులతో ప్రక్షాళించు
మా మతులు, నీ ప్రవక్తల మహి
తోక్తులతో వెలిగించు మా మనసులు



ముహమ్మద్ అజీజుర్రహ్మన్

ముస్లిం జీవితానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు

ప్రశ్న: ఖుర్‌ఆన్ అంటే ఏమిటి?

జ: ఖుర్‌ఆన్ దైవగ్రంథం. దాన్ని పఠించటం పుణ్యప్రదం. దాని పారాయణం కూడా ఆరాధనే. అల్లాహ్‌యే ఈ గ్రంథానికి ఆది. కడకు ఇది ఆయన వైపుకే మరలించబడుతుంది. ఈ గ్రంథం దైవప్రోక్తం. నిజానికి అల్లాహ్‌యే దీనిని అక్షర సమేతంగా హెచ్చు స్వరంతో పలకగా, దైవదూత జిబ్రయీల్ (అలైహిస్సలాం) దాన్ని విని మహాప్రవక్త(స) వరకు చేర్చారు. ఇతర ఆకాశగ్రంథాలు కూడా దైవ ప్రోక్తమే.

ప్రశ్న: ఖుర్‌ఆన్ ను పొందిన మనం ముహమ్మద్(స)వారి విధానాన్ని (సున్నత్) విడిచిపెట్టవచ్చునా?

జ: ఇలాంటి సమ్మకం సరైనది కాదు, సమ్మతమూ కాదు. పైగా ప్రవక్త(స) విధానాన్ని పాటించవలసినదిగా అల్లాహ్ ఆజ్ఞాపించాడు. ఈ విధంగా సెలవీయబడింది: **"దైవప్రవక్త మీరు ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే దాన్ని వదలి పెట్టండి"** (అల్ హష్ర్ – 7)

ఖుర్‌ఆన్‌ను బాగా విడమరచి చెప్పేందుకు ఏతెంచినదే ప్రవక్త(స) విధానం (సున్నత్). అదీగాక నమాజుతో సహా ఎన్నో ధార్మిక విషయాలు హదీసు లేకుండా అర్థం కావు. దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు: **"వినండి! నాకు ఖుర్‌ఆన్ ఇవ్వబడింది. దానివంటిదే ఇంకాను (హదీసు,కూడా). వినండి! త్వరలోనే ఒక కాలం రానున్నది. మనిషి తన పరుపుపై హాయిగా కూర్చొని, 'మీరు ఈ ఖుర్‌ఆనునే పట్టుకొని ఉండండి. ఇందులో హలాల్(ధర్మం)గా పొందిన దానినే హలాల్‌గా భావించండి. ఇందులో హరామ్ (అధర్మం)గా పొందినదానినే అధర్మంగా భావించండి.అని అంటాడు."**

(అబూదావూద్)

ప్రశ్న: దైవప్రపక్తలను విశ్వసించటంలోని భావం ఏమిటి?

జ: దైవప్రవక్తలను విశ్వసించటంలోని మతలబు ఎమిటంటే– అల్లాహ్ ప్రతి మానవ సముదాయంలో స్వయంగా వారిలో నుండే ఒక ప్రవక్తను పంపాడు. ఆ ప్రవక్త ఆ జాతి వారిని ఏకదైవారాధన వైపు పిలిచాడు. దైవేతరుల దాస్యం చేయటం నుండి వారించాడు. ఈ విషయం సత్యమని మనం ధృవీకరించాలి. దైవప్రవక్తలంతా సత్యవంతులు, సజ్జనులు, నిర్దోషులు, ధర్మనిష్ఠాపరులు, నిజాయితీ తత్పరతగలవారు. దేవుడిచ్చి పంపిన సందేశాన్ని వారు హెచ్చు తగ్గులు లేకుండా మానవాళికి అందజేశారు అనే సత్యాన్ని కూడా ధృవపరచాలి. ఇంకా వారు మానవోత్తములని, పుట్టినప్పటి నుండి పోయేటప్పటి వరకు వారు షిర్క్ (బహుదైవారాధన)కు ఒడిగట్టలేదని ధృవీకరించాలి.

ప్రశ్న: అంతిమ దినాన్ని విశ్వసించటంలోని ఆంతర్యం ఏమిటి?

జ: అంతిమ దినంపై విశ్వాసం అనే వాక్యం చాలా సమగ్రమైనది. ఇందులో మరణంపై, మరణానంతరం సమాధిలో ఎదురయ్యే పరీక్షపై, సమాధి యాతనపై, సమాధిలోని సౌఖ్యంపై, శంఖం ఊదటంపై, ప్రజలు తమ ప్రభువు సమక్షంలో హాజ రవటంపై, కర్మల రికార్డులు తెరువబడటంపై, త్రాసు ప్రతిష్ఠించ బడటంపై, పుల్‌సిరాత్‌పై, కౌసర్ సరస్సుపై, సిఫారసుపై, ప్రజలు స్వర్గం లేదా నరకంలో ప్రవేశించటంపై విశ్వాసం – ఇదంతా అంతిమ దినంపై విశ్వాసంలో చేరివుంది.

ప్రశ్న: ప్రళయ దినాన ఎన్ని రకాల సిఫారసు ఉంటుంది?

జ: ప్రళయ దినాన అనేక రకాల సిఫారసు ఉంటుంది. వాటిలో అన్నిటికన్నా 'అతిపెద్ద సిఫారసు' మహ్‌షర్ మైదానం లో ఉంటుంది. జనులు తీర్పుకోసం 50 వేల ఏళ్ళుగా ఎదురు చూస్తూ ఉంటారు. అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్(స) తన ప్రభువునుద్దేశించి, ప్రజల తీర్పును తెమల్చమని ప్రాధేయపడ తారు. ఈ సిఫారసు అంతిమ ప్రవక్త(స) వారికే ప్రత్యేకం. ఆయన(స)కు వాగ్దానం చేయబడిన "మఖామెమహ్‌మూద్" (ప్రశంసాపూర్వమైన స్థానం) కూడా ఇదే.

రెండవ సిఫారసు: స్వర్గ ద్వారం తెరిపించటానికి సంబంధించినది. స్వర్గ ద్వారాన్ని తెరిపించే ఘనత కూడా మహనీయ ముహమ్మద్ (స) వారికే దక్కుతుంది. అందరికన్నా ముందు ఆయన (స) అనుయాయులు స్వర్గంలో ప్రవేశిస్తారు.

మూడవ సిఫారసు: నరకానికి ఆహుతిచేయాలని తీర్పు జరిగిన జనుల గురించి. ఈ సిఫారసు ఆమోదించబడిన కారణంగా వారు నరకాగ్ని నుంచి రక్షించబడతారు.

నాల్గవ సిఫారసు: నరకానికి ఆహుతి చేయబడిన పాపాత్ములైన ఏకదైవారాధకుల గురించి. ఈ సిఫారసు మూలంగా వారు నరకంలో నుంచి తీయబడతారు.

ఐదవ సిఫారసు: కొంతమంది స్వర్గవాసుల ఉన్నతి అంతస్తుల కొరకు చేయబడుతుంది.

వీటిలో చివరి మూడు సిఫారసులు మహాప్రవక్త ముహమ్మద్ (స)కు ప్రత్యేకం కావు గాని ప్రథమ ప్రాధాన్యత మాత్రం ఆయనకే ఇవ్వబడుతుంది. ఆయన (స) తరువాత ఇతర ప్రవక్తలకు, దైవదూతలకు,సజ్జనులకు, అమరగతులకు సిఫారసు చేసే అవకాశం కల్పించబడుతుంది.

ఆరవ సిఫారసు: ఇది విశ్వాసులైన కొందరు దాసులకు ఉంటుంది. వారు ఎలాంటి లెక్కాచారం లేకుండానే స్వర్గంలో ప్రవేశించేందుకు అనుమతించబడతారు.

ఏడవ సిఫారసు: కొంతమంది అవిశ్వాసుల శిక్షా తీవ్రతను తగ్గించేందుకు చేయబడుతుంది. ఈ సిఫారసు కూడా మహా ప్రవక్త(స)కే ప్రత్యేకం. ఆయన(స)తన పెత్తండ్రి అబూతాలిబ్ శిక్షను తగ్గించమని దుఆ చేస్తారు.

ఇక చివర్లో అల్లాహ్ ఎవరి సిఫారసుతోనూ నిమిత్తం లేకుండా కేవలం తన కటాక్షంతో కొంతమందిని నరకం నుంచి బయట కు తీసి స్వర్గంలో చోటు కల్పిస్తాడు. వారు దేవుని ఏకత్వం (తౌహీద్)పై నమ్మకంతో చనిపోయినవారు. వారెంతమంది ఉంటారనేది అల్లాహ్‌కే తెలుసు.

నేరం

– ముహమ్మద్ ఖాన్ (గన్నవరం)

ఆత్మ సాక్షిగా సాక్ష్యమిస్తున్నా
ఆత్మద్రోహం నేరానికి మించిన మరో నేరం
ఈ సృష్టిలో లేనే లేదని, అది రాజద్రోహ నేరంకన్నా అధికమని.

నేరం ఎరుగని మనిషి ఎవరున్నరు!?
తెలియక చేసిన నేరం కన్నా
తెలిసి చేసిన నేరమే, మనిషిని అధికంగా హింసిస్తుంది.

మనసు బండరాతిగా రూపాంతరం చెందాక
ముద్దాయి ఎన్ని నేరాలు చేసినా
అవి, నేరాలుగా అతని దృష్టికి రానేరావు
అతనిని, ఏ హింసా హింసించజాలదు.

సున్నితమైన మనసున్న ప్రతి వ్యక్తి
అతని దృష్టిలో
ప్రతి అంశమూ నేర పరిశీలన దృష్టిలోనే ఉంటుంది.

అది, మాటగా కావచ్చు, చేతగా కావచ్చు
మరే రూపమైనా కావచ్చు!
అతని ఆత్మ నిత్యం హెచ్చరికలు జారీ చేస్తూ
తాకీదులు ఇస్తూ, పరిధి దాటనీయక
ఎంతో కట్టుదిట్టంగా ఉంచి, నియంత్రిస్తూ ఉంటుంది.

మన నేరాలకు, ఘోరాలకు
తనే ప్రత్యక్షంగా బాధ్యత వహిస్తూ
వాటి పర్యావసానాన్ని, బాధను హింసనూ
తనే మోస్తూ అతి సున్నితంగానే
తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ ఉంటుంది.
అలాంటి మనసుపై ఏ చిన్న అపవాదు గాయమై తగిలినా
అలాంటి బాధనూ హింసనూ ఎదుర్కొనే శక్తి లేక
విలవిల లాడుతుంది!

నీచ ప్రవృత్తీ!

– శాంతిప్రియ

స్వచ్ఛమైన ముస్లిం సమాజంలో
తుచ్ఛమైన కోర్కెలను రాజేసిన
దెవ్వరు, నవ్వేనా
క్రొవెక్కిన కబీస్!

ఒక్క బాంబు విసిరి
వేల జనాలను బలిగొని
ఏమెరుగనిలా దిక్కులు
చూచు నంగనాచీ!
ఛీఛీ! విష వీచీ!

సౌమనస్యమను పేరిట
వైమనస్య పిపాస దీర్చ
శాంతి శ్రేయమను ముసుగున
మారణ హోమ కణం రగిలించ
నెంచు నీచ ప్రవృత్తీ!
ఇదా నీ అసలు ఆకృతీ!

సద్దాం, లాడెన్‌ల సాకున
పెట్రోల్ నిధుల కబ్జ
తాలిబాన్, అల్‌ఖైదా చాటున
పాపమెరుగని పసికందుల వధ
గాజాపట్టి ప్రజల వృధ
సామ్రాజ్య పిపాస బుసలుకొట్టెను లేరా!
నీ కుటిల నీతి పసికడితిమి పోరా!

అన్య దేశాల ప్రగతి పచ్చ
తోరణాలు చూచి ఓర్వక
కళ్ళు మండే కుళ్ళు సంస్కృతి నీది, నీ
నిజ స్వరూపం బాగా తెలుసు మాకు

ఇరాకు దేశమున చొరబడి
దురంతాల దురాక్రమణల కొడిగట్టే
దుర్బుద్ధి తగదురా! హిట్లర్
ముస్సోలినీ సోదరా!

ముస్లిం జన సత్వమ్మును
పరీక్షించబోకురా తిరిపమెత్తు
తిరిపజోగి; అది సహనానికి ఏలిక,
సమరానికి జ్వాలిక

షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ

పూర్ పరిచయం

సంతృప్తి - విజయం



ప్రేమ,శాంతి ఉన్న చోట సంతృప్తి ఉంటుంది. సంతృప్తిగా బ్రతకటం కన్నా విజయం మరొకటి లేదు. అవతలి వారి డబ్బు నిగానీ, కీర్తినిగానీ, అధికారాన్నిగానీ చూసి ఈర్ష్య పడకపోవటమే విజయం.

గతాన్ని చూసి విచారించకపోవటం విజయం, ఒక గుడ్డి-మూగ-చెవిటి వ్యక్తి అరచేతి మీద నేనొక ప్రశ్న వ్రాసాను... సంతృప్తి అంటే ఏమిటి? అని, అతడికేం తెలుస్తుందిలే అని తేలిగ్గా అనుకున్నాను. తెలిసినా, ఎలా చెప్తాడా అని ఉత్సుకంగా చూసాను. అతడు నన్ను చూసి నిర్మలంగా నవ్వేడు. తృప్తి అంటే ఏమిటో నాకర్థ మైంది.

సేవలు చేయించుకోవాలను కోవటం కన్నా -సేవ చేయటం, ప్రేమింప బడాల నుకోవటం కన్నా-ప్రేమించటం, అర్థం చేసుకో బడాలనుకోవటంకన్నా-అర్థం చేసుకోవటం, తీసుకోవటంకన్నా-ఇవ్వ టం.. అదే విజయం! ఇటువంటి విజయం లో సంతృప్తిని పొందగల్గటం...సంపూర్ణ విజయం!! అటువంటి సంపూర్ణ విజ యాన్ని మరొకరికి పంచగల్గటం..... అంతిమ విజయం!

జీవితం – ప్రకృతి మనకిచ్చిన బహుమతి! సంతృప్తి – మనం ప్రకృతికిచ్చే బహుమతి. మన అసంతృప్తులకి కారణం, మనం వంతెనలకి బదులు గోడలు కట్టడమే.

(యండమూరీ వీరేంద్రనాథ్ పుస్తకం నుండి)

ఆ నలుగురు

1- ఇమామ్ అబూహనీఫా(ర)
పేరు: నొమాన్ బిన్ సాబిత్.
బిరుదు: అబూహనీఫా
జననం: హిజ్రీ శకం 80
స్థలం: ఇరాక్‌లోని కూఫా పట్టణం
మరణం: హిజ్రీ శకం 150
స్థలం: బగ్దాద్.

2 - ఇమామ్ మాలిక్ (ర)
పేరు: మాలిక్ బిన్ అనస్.
జననం: హిజ్రీ శకం 93
స్థలం: మదీనా.
మరణం: హిజ్రీ శకం 179 మదీనాలో.

3- ఇమామ్ షాఫయి (ర)
పేరు: ముహమ్మద్ బిన్ ఇద్రీస్ అష్షాఫయి.
జననం: హిజ్రీ శకం 150
స్థలం: ఫలస్తీనియాలోని గజ్జా పట్టణం
మరణం: హిజ్రీ శకం 204 ఈజిప్టులో.

4 - ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (ర)
జననం: హిజ్రీ శకం 164
స్థలం: బగ్దాద్ పట్టణం.
మరణం: హిజ్రీ శకం 241 బగ్దాద్‌లో.

అందరూ మనుషులే




"ప్రపంచంలో పాదుషా మానవుడే, బీద వాడయిన ఫకీరూ మానవుడే, ధనవంతుడూ మానవుడే, ధనవిహీనుడూ మానవుడే, దివ్యాన్నం భుజించేవాడూ మానవుడే, రొట్టెముక్కలు అడుక్కునేవాడూ మానవుడే".

(నజీర్ అక్బరాబాదీ)

నడక-నడవడిక

స్వామి వివేకానంద ఓ సభలో పాల్గొనడం కోసం 1896లో అమెరికా వెళ్ళారు, అప్పటి ఆచారం ప్రకారం భారతీయ డ్రస్ (కుట్టులేనివి) ధరించి వాకింగ్ చేస్తుంటే అది అమెరికా వారికి కొత్తది. ఆయన్ను చూసి ఒక అమెరికన్ ఆవిడ తన భర్తతో **"ఈ మనిషి నాకు జెంటిల్‌మెన్ కనబడటం లేదు"** అని అన్నది. స్వామీ వివేకానంద ఆమె మాట విని ఆమె దగ్గరకి పోయి **"నన్ను క్షమించండి! మీ దేశంలో టైలర్ మనిషిని జెంటిల్‌మెన్‌గా తయారు చేస్తాడు, కాని ఏ దేశం నుంచి నేనొచ్చానో అక్కడ గుణము, నడవడిక (క్యారెక్టర్) మనిషిని జెంటెల్‌మెన్‌గా చేస్తుంది."** అని అన్నారు. ఇలా గర్వంగా ఇప్పుడు మనం చెప్పగలమా?





కాఫీ విధ్ నెలవంక

మీకు తెలుసా?

⇨ప్రపంచ జనాభాలో మగవాళ్లు **51,5** శాతం. భూమధ్య రేఖకు దగ్గరగా ఉండే వాళ్ళకు ఆడ పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువంట.

⇨మన తల మీద వెంట్రుకలు ఏడాదికి సగటున **12** సెంటీమీటర్లు పెరుగుతాయి.

⇨సాధారణంగా మనిషి కీబోర్డుపై టైప్ చేసే టప్పుడు **56** శాతం ఎడమ చేత్తోనే చేస్తాడు.

⇨జలుబు తగ్గడానికి చికెన్ సూప్ కూడా మంచి మందులా పని చేస్తుంది.

⇨పశ్చిమార్ధగోళంలో మిలటరీ లేని ఏకైక దేశం కోస్టారికా. ఆ దేశ రాజ్యాంగం **1949**లో సైన్యాన్ని నిషేధించింది. అలా సైన్యం లేని మొట్టమొదటి దేశంగా రికార్డులోకి ఎక్కింది కోస్టారికా.

⇨ఇప్పుడున్న **8** పని గంటల విధానానికి ఓ ప్రత్యేకత ఉంది. అదేంటంటే... రోజులోని **24** గంటల్లో **8** గంటల పని. **8** గంటలు విశ్రాంతి. **8** గంటలు వినోదం ఉండాలన్నది దాని వెనుక ఆలోచన. ఈ విధానాన్ని బ్రిటన్‌కు చెందిన రోబర్ట్ ఓవెన్ ప్రతిపాదించాడు.

⇨పొగ త్రాగే గర్భిణులకు పుట్టే పిల్లలు క్రూర స్వభావులై ఉంటారని ఒక పరిశోధన.

⇨**1991**లో ఒకే మొత్తంలో బంగారం, వెండి, ప్లాటినంలలో పెట్టుబడి పెట్టిన వాళ్లకు **2011**లో వెండి వల్లే అత్యధిక లాభం వచ్చింది. అప్పటికీ ఇప్పటికీ వెండి ధర సుమారు **900** శాతం పెరిగితే, బంగారం **368** శాతం, ప్లాటినం **344** శాతం పెరిగింది.

ప్రపంచంలో అతి పెద్ద మానవ నిర్మిత జలపాతం ఇటలోని 'ది కార్మటే డెల్లే మార్మోర్' ఇది **541** అడుగుల ఎత్తు నుండి కిందికి దూకుతుంది.



ఎవరు నేను?

నేను అయిదక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలోని మొదటి నాలుగు అక్షరాలకు గతం అని. 4,5,2 అక్షరాలకు తేనీరు అని. 3,4,5,1 అక్షరాలకు మెట్టు అని. 1, 5, 4 అక్షరాలకు పెంపుడు జంతువని అర్థం. మరి నేనెవరు?

Paste

హితోక్తి

⇨పక్కవాడి దృష్టిలో మనం మోసే బంధాల మాటలు వృధా. కానీ వాడు మోసేది బంగారు మూటలు. లోకం తీరు అంతే.

⇨సోమరులు, ఉత్సాహహీనులు, ఉద్దేశ రహితులు, విరక్తులు సృష్టించుకున్నదే 'అదృష్టం' అనే బూచి.

⇨ఈ నాగరిక ప్రపంచంలో మతి లేని మనిషి ఉండవచ్చునేమో గాని స్వమతము లేని మనిషి ఎక్కడా కానరాడు.

⇨డబ్బున్నా చదువున్నా, శరీర బలమున్నా నీతి లేనప్పుడు మానవుడు సభ్య సమాజంలో ప్రజాకీర్తిని పొందలేడు.



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

ఐపిసి ఆధ్వర్యంలో 'ఈదుల్ ఫిత్ర్'

ఐపిసి తెలుగు విభాగం ఆధ్వర్యంలో 30- 08- 2011వ తేదీ మంగళవారం నాడు ఈదుల్ ఫిత్ర్ ప్రోగ్రాం విజయవంతంగా జరిగింది. తెలుగు ముస్లిం అసోసియేషన్ (టిఎమ్ఎ) అనుబంధంతో కువైట్ సిటీలోని మస్జిద్ అల్ హమద్‌లో జరిగిన ఈ ఉత్సవంలో 380 మంది స్త్రీపురుషులు, న్యూ ముస్లిం సోదరసోదరీమణులు పాల్గొని ప్రభువైన అల్లాహ్‌కు శ్రద్ధాభక్తుల నివాళి ఘటించారు. ఈ కార్యక్రమానికి వివిధ బ్రాంచీలకు చెందిన ధర్మ ప్రబోధకులు హాజరయ్యారు. నమాజ్ అనంతరం క్రీడా విన్యాసాలు జరిగాయి. క్విజ్ ప్రోగ్రామ్ నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేయటం జరిగింది. టిఎమ్ఎ సెక్రెటరీ బ్ర దర్ షౌకత్ ఖాన్ ఆహూతులకు స్వాగతం పలకగా టిఐమ్ఎ డైరక్టర్ ముహమ్మద్ హనీఫ్ గారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో తోడ్పడిన కార్యకర్తలందరికీ, ముఖ్యంగా టిఎంఎ టీమ్‌కు, ఐపిసి తెలుగు విభాగం కృతజ్ఞతలు తెలుపుకుంటోంది.











టి.ఎమ్.ఎ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




తెలుగు ముస్లిం అసోసియేషన్ (టిఎమ్ఎ) ఆధ్వర్యంలో 11-08-2011 గురువారం కువైట్ సిటీలోని మస్జిద్ అల్ కబీర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 400 మంది స్త్రీపురుషులు, న్యూ ముస్లిం సోదరసోదరీమణులు పాల్గొన్నారు. భారత దేశం నుండి ఔఖాఫ్ అతిథిగా విచ్చేసిన మౌలానా అబ్దుల్ ఖాదిర్ ఉమ్రీ గారు 'రమజాను శిక్షణా కాలం' అన్న అంశంపై ప్రసంగించారు. మౌలానా తాహెర్ మదనీ గారి తుది హితవులు మరియ దుఆతో ఈ కార్యక్రం ముగిసింది. ఈ కార్యక్రమానికి వివిధ ఐపిసి బ్రాంచీలకు చెందిన ధర్మ ప్రబోధకులు హాజరయ్యారు.

టి.ఎమ్.ఎ ఆధ్వర్యంలో ఈద్ గెట్ టు గెదర్

తెలుగు ముస్లిం అసోసియేషన్ (టిఎమ్ఎ) ఆధ్వర్యంలో 10-09-2011 శనివారం కువైట్ సిటీలోని మస్జిద్ అల్ కబీర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది ప్రముఖులు హాజరయ్యారు. తెలుగు ప్రజల మధ్య స్నేహ భావం పెంపొందాలన్న ఉద్దేశ్యంతో **'స్నేహ కుడలి'** అన్న బ్యానర్ క్రింద జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఐపిసి ప్రబోధకులు షేఖ్ ముహమ్మద్ బిలాల్ గారి ఖుర్‌ఆన్ పారాయణంతో ప్రారంభమయిన ఈ కార్యక్రంలో టిఐమ్ఎ డైరక్టర్ ముహమ్మద్ హనీఫ్ పరిచయ పలుకులు చెప్పగా, **నెలవంక** ఎడిటర్ సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ – తెలుగు సోదరుల మధ్య ఉండాల్సిన సంఖ్యతను గుర్తు చేస్తూ, మన మధ్య ఉండాల్సింది గోడలు కాదు, ఒండొకరిని చేరుకునే వంతెనలు అన్నారు. శ్రీ సత్య సాయి సేవా సమితి మాజీ అధ్యక్షులు శ్రీ బి. పాండురంగారావు మాట్లాడుతూ ఇటువంటి ఒక కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు అభినందించారు. పర్సపరం ప్రేమ, అనురాగం, నిజాయితి, అంకిత భావ అవసరాన్ని నొక్కి వక్కాణించారు. తర్వాత కళాంజలి ప్రెసిడెంట్ శ్రీ మురళీ మనోహర్ గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఎలా రూపుదిద్దుకుందో వివరించడమేకాక, ఇటువంటి కార్యక్రమాలు ఎక్కడ జరిగినా పాల్గొనాల్సిందిగా కోరారు. తర్వాత యుటిఎఫ్ కన్వినర్ సోదరులు వీర్రాజు గారు మాట్లాడుతూ కువైట్‌లో తెలుగువారి సమస్యల పరిష్కార నిమిత్తం యుటిఎఫ్ ఏర్పడిందని, రమాజనులో అన్యాయంగా బలైన తెలుగు సోదరుల ఆర్థిక సహాయాం అందించే నిమిత్తం కృషి చేస్తోందని తెలిపారు. తర్వాత ప్రవాసాంధ్ర తెలుగు దేశం గౌరవ అధ్యక్షుడు వెంకట శివ మాట్లాడుతూ – రాజికీయం అవినీతమయం కాదు. ఎలాగైతే మతఛాందసవాదులుంటారో అలాగే జారకీయ నాయకుల్లో అవినీతిపరులుంటారు అన్నారు. చివర్లో భారత దేశం నుండి విచ్చేసిన ధర్మ ప్రబోధకులు సయ్యిద్ అహ్మద్ గారు మాట్లాడుతూ – సమాజంలో నెలకొని ఉన్న అన్యాయాన్ని, అక్రమాన్ని ఎలా నిర్మూలించాలో ధార్మిక గ్రంథాల వెలుగులో సూచించారు. కఠిన శిక్షలు అమలు అయినప్పుడే సమాజంలో ఉగ్రవాదం అంతమవగలదని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమం ఏర్పాటుకి సహకరించి సామాజిక కార్యకర్త శ్రీ ముద్దన పల్లి సుబ్బారాయుడు గారికి, ఇతర ప్రముఖులందరికీ టిఎమ్ఎ కృతజ్ఞతలు.





- తాహెరా బేగం

నీ పిలుపుకు సమాధానంగా



"నాన్నొచ్చారు, నాన్నొచ్చారు" అని పిల్లలు ప్రేమతో పరుగెత్తుకుని వచ్చి తండ్రి కాళ్ళను వాటేసుకున్నారు. తండ్రి వారిని కోపంతో విడదీస్తూ ఇల్లు దద్దరిల్లేటట్లు భార్యను కేక వేసి పిలిచాడు, తనకి ఒంట్లో బాగా లేదు వారిని అక్కడ్నుంచి తీసికెళ్ళమని చెప్పి సోఫాలో కూలినట్లు కూర్చున్నాడు. పిల్లల ప్రేమనూ వారి అమాయకత్వాన్ని లెక్క చేయలేదు. కాస్సేపటి తరువాత భార్య మంచి నీటి గ్లాసు ప్రేమగా అందిస్తూ అతని ఆవేదనకు కారణ మడిగితే, అతడు నిస్పృహ నిండిన స్వరంతో, "నేను ఉద్యోగం చేసే కంపెనీ దివాలా తీసింది, ఈ నెలాఖరున అది ఎత్తేయ బడుతుంది. నేనిక ఈ జీవిత నావను నెట్టేదెలా? శంకతో నిండిన హృదయం, నిరాశతో కూడిన స్వరం.

"ఏం చేయనక్కా నలుగురమ్మాయిలు గుదిబండలా తయారై ఛాతీపై కూర్చున్నారు, యవ్వనంలో ఉన్నప్పుడు ఎందరో పెళ్ళి చూపులకొచ్చారు. కానీ ఏ ఒక్కడూ వారికి తగిన వాడూ కాదు, అలాంటప్పుడు చూస్తూ చూస్తూ నా పిల్లల్నెలా నూతిలో నూకేది? మంచివారు కావాలని వెతకగా, సమయం గడిచిపోయింది. అమ్మాయిల యౌవనం ముదిమి ముసుగేసుకుంది. మేము కూడా ఈ భారాన్ని మోసి మోసి ముసలివాళ్ళ మయ్యాము. నేనెలా ఏగను? ఎలా వారికో ఇంటి వారిని చేయగలను? మా తరువాత వారి గతేంటి?" భయం, ఆవేదనాభరిత రుద్ధ కంఠం!

"నాన్న క్యాన్సర్ పేషెంట్, అమెరికా డాక్టర్లను సంప్రదించాను, లెక్కలేనంత డబ్బు ధార పోశాను కానీ లాభం లేదు. నాన్న జీవితాంతం మా కోసం కష్ట పడ్డారు, మాకు ఉన్నత విద్యలనీ, తిండి గుడ్డలనీ, మా భవిష్యత్తనీ రేయింబవళ్ళు శ్రమించారు. ఇప్పుడు వారి శ్రమ ఫలం తినే సమయం వచ్చింది కానీ వారు ప్రాణ సంకటంలో ఉన్నారు. ఎలా వారిని మృత్యువు నుండి బయటకు లాగను? ఎలా!?" ఏమి చేయలేని దయనీయ స్థితి!! అశ్రువుల్ని కుండపోతగా కురిపించే కళ్ళు!!

"క్షణం వృధా చేయక రాత్రి పగలు కష్ట పడ్డాను కానీ పరీక్షలో కఠిన ప్రశ్నలనెదురు కోవాల్సి వచ్చింది, పాసౌతానో లేదో, ప్యాస వక పోతే నా తల్లిదండ్రులకేమి జవాబివ్వను, వారు పూర్తిగా నన్ను నమ్ముకున్నారు." అంటూ ఆశానిరాశల మధ్య ఊగిసలాడే ఒక విద్యార్థి.

పరిస్థతుల వత్తిడికి తలక్రిందులయ్యే తండ్రులు, పిల్లల భవిష్యత్తులను పరివేక్షించలేని తల్లులు, జీవన్మరణాల మధ్య కొట్టు మిట్టాడే ఆత్మీయులు, కోరుకున్నది లభిస్తుందా లేదా!? అని ఆశగా ఎదురు చూసే పిల్లలూ. ఎటు చూసినా ఎలా, ఏం చేయాలి? అనే సమస్యను మరింత జఠిలం చేసుకున్నవారే తప్ప ఈ సమస్యలకు పరిష్కారమేది? ఎందుకు జీవితాల్లో నుంచి శాంతి క్షీణించుకు పోతుందని ఎప్పుడైనా ఎవరైనా ఆలోచించారా? కాస్త ఆలోచిస్తే మనకు తెలుస్తుంది దీని కారణం ఆ సృష్టికర్తపై విశ్వాస కొరత, మన విద్యార్హతలపై మనకున్న గర్వం, మన కున్న తెలివితేటలపై మనకున్న ఓవర్ కాన్ఫిడెన్స్. చెప్పుకోవటానికి మనం ముస్లిం లమే కానీ మనమెప్పుడు అల్లాహ్‌పై ఆధార పడలేదు. అతన్నే మన జీవన సారథిగా, విధి విధాతగా మనకు మనం అంకితం చేసుకోలేదు, ఆయన పంపిన గ్రంథ వాక్యాలను గమనించలేదు. అల్లాహ్ సుబ్హానహూ వ తాలా ఇలా అన్నారు:

"ఎవడు అల్లాహ్‌కు భయపడుతూ పని చేస్తాడో, అతనికి అల్లాహ్ కష్టాల నుండి గట్టెక్కే మార్గం చూపుతాడు. ఇంకా అతని ఊహకు కూడా అందనటువంటి మార్గం ద్వారా, అతనికి ఉపాధి ప్రసాదిస్తాడు. అల్లాహ్‌ను నమ్ముకున్నవానికి అల్లాహ్‌యే చాలు. అల్లాహ్ తన పనిని పూర్తి చేసి తీరుతాడు. అల్లాహ్ ప్రతిదానికి ఒక విధి నిర్ణయించి ఉంచాడు." ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) ఇలా అన్నారు: "నేను వ్యాధికి గురి అయినప్పుడు, ఆయనే నాకు స్వస్థతను చేకూరుస్తాడు."

అల్లాహ్ తఆలా మనకు స్పష్టంగా తెలియ పరుస్తున్నదేమనగా అతనికి తప్ప మానవుడు మరెవ్వరికీ భయపడకూడదు. మరి ఉపాధి పోతుందన్న భయమెందుకు? అనారోగ్య ఆందోళన దేనికి? అమ్మాయిల వివాహ విచారణతో విలవిలలాడటానికి కారణం? విఫల మౌతామన్న విచారమెందుకు? పిల్లల్లేరన్న బాధ దేనికి? అల్లాహ్ ఎవరి భాగ్యంలో ఎంత ఉపాధిని పెట్టాడో అంత లభించి తీరుతుంది. ఏ మార్గాలనుండంటే మనషి ఊహకందని మార్గాల నుండి, ఏ అమ్మాయిని ఎవరు వివాహమాడాలో అతడు ఆ అమ్మాయిని వెతుక్కుంటూ వస్తాడు. ఆయువు గడిచిన తరువాత పోయే వారినెవరూ ఆపలేరు, అలాగే సఫల విఫలాలు ఇచ్చేవాడు అతనే కాబట్టి మనం మొత్తుకున్నా, మధన పడినా, మరణించినా సాధించేదేమీలేదు.

అల్లాహ్ ఇలా అన్నాడు: "ఏ శక్తీ మీపై ఆధిక్యాన్ని సాధించలేదు. ఆయన మిమ్మల్ని విడిచి పెట్టినట్లైతే ఆ తరువాత మీకు సహాయం చేయగలిగే వాడెవడు?" మరి మనమెందుకు సమస్యలకు భయపడాలి, మన లాంటి అసహాయులైన ప్రజలపై ఎందుకు ఆధారపడాలి? పరిశుద్ధుడైన అల్లాహ్ ఇలా ప్రశ్నిస్తున్నాడు, "బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి అతని బాధను తొలగించే వాడు ఎవడు? భూమిపై మిమ్మల్ని ప్రతినిధులుగా చేసినవాడు ఎవడు?"

ప్రాతినిధ్యం, రాజ్యం, ఉపాధి, వివాహం, పిల్లలు, రోగం, కష్టాలనుండి బయట పడడం, అంతా మనమనుకున్నట్లే జరుగుతుంది, అన్నీ వసతులు కలుగుతాయి, అన్నీ అమర్చి బడతాయి. కాని దానికొక అత్యవసర షరతు. అదే మనగా అల్లాహ్ యందు పూర్తి విశ్వాసం, ఆయన తప్ప మరెవ్వరూ మనకు తోడ్పడే వాడు లేడని నమ్మకం, మన బాగోగులు పూర్తిగా ఆయనపై వేసి వినయమూర్తులై రెండు చేతు లెత్తి అతని ముందు యాచించి నట్లైతే, భవిష్యత్తు అంధకార నీడలు మనకు చుట్టు ముట్టవూ, అయ్యో అనే అయోమయ స్థితికి మనము చేరుకోము. సిగ్గుతో తలవంచుకునే స్థితి మనకు రాదు. దానికి బదులు అతని ముందు శాష్టాంగ పడి శరీర అణువణువూ ఆ ప్రభువు సమక్షంలో ప్రాధేయపడుతుంది. మన అంతరాత్మ మనల్ని అల్లాహ్ ఇచ్చిన ఓర్పు సందేశంతో ఓదారుస్తుంది. **"అల్లాహ్ కరుణ నుండి నిరాశ చెందకండి"** అనే వచనం మనలో ఒకలాంటి సంతోషాన్ని రేపుతూ అల్లాహ్‌నే కోరేవారుగా మారుస్తుంది, సాఫల్యా

ర్జనకై విశ్వాస మార్గాలవైపు తరులుతుంది, ప్రవక్తగారు నేర్పిన పాఠాలను వల్లకించేలా చేస్తుంది.

అల్లాహ్ ఇలా అన్నారు: **"నా దాసులు నన్ను గురించి నిన్ను అడిగితే, నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను అనీ, ఓ ప్రవక్తా నీవు వారికి తెలుపు. కనుక వారు నా సందేశం విని దానిని స్వీకరించాలి. నన్ను విశ్వసించాలి."**

అల్లాహ్ మనకు చాలా దగ్గరగా ఉన్నాడు, మన కంఠ రక్తనాళం కంటే దగ్గరగా ఉన్నాడు, మన పిలుపును వినడమేకాక మనల్ని జవాబుతో ఆదరిస్తాడు.



ప్రార్థన(దుఆ) ఒక ఆరాధన. అల్లాహ్ సాన్నిధ్యాన్ని పొందే ఒక మార్గం. మనిషికి వినాశం నుండి రక్షిణనిచ్చే ఒక అస్త్రం. హృదయాలకు శాంతినిచ్చే ఒక తైలం, మస్తిష్కాలకు మర్దన, జీవిత కష్టాలలో ఆసరా ఇచ్చే ఒక పటిష్ట దూలం, మనిషి శాంతి భద్రతలకు సంకేతం. ఎలాగైతే ఎండకు వాడిపోయిన మొక్కలను వర్షం పునర్జీవమిచ్చి పచ్చటి రంగుతో కళకళ లాడేటట్లు చేస్తుందో అలాగే సమస్యలతో సతమతమయి కృంగిపోయిన హృదయాలకు ఉత్సాహ ఉల్లాసాలతో సజీవంగా మార్చే ఒక దివ్య కరుణ దుఆ.

దుఆ చేయుట ఆదం అలైహిస్సలాం నుండి ప్రవక్త ముహమ్మద్ (స) వరకు అందరు ప్రవక్తల ఆచారం. సహాబా(ర)లు వారి తరువాత వచ్చిన వారు ప్రార్థనలతో పొందిన శుభాలు ఎనలేనివి. మరి మనమెందుకు నిజ దేవుడైన అల్లాహ్ అనుగ్రహాల ప్రాప్తికై ప్రయత్నించకూడదు? ప్రవక్త గారు నేర్పిన పద్ధతి నవలంభించ కూడదు? మనమెందుకు మన లాంటి నిస్సహాయులెదుట మన అవసరాలను వ్యక్త పరచాలి? దానికి బదులు ప్రవక్త గారి లా అన్నారు: **"ఒక ముస్లిం అల్లాహ్‌ను ఏదైనా అడుగుటకు తలెత్తినప్పుడు అల్లాహ్ అతనడిగింది తప్పనిసరిగా ఇస్తాడు. అడిగింది అప్పటికప్పుడే పూర్తి చేస్తాడు లేక దాన్ని ప్రళయ దినాన ప్రసాదిస్తాడు లేక ఆ దుఆకు బదులు కష్టాలను తొలగిస్తాడు."**


దుఆ అల్లాహ్‌పై పూర్తి నమ్మకంతో చేయాలి. దురదుష్టవశాత్తు ఏదైనా ఆపద వచ్చినప్పుడు మనము చిత్తశుద్ధితో కేవలం అల్లాహ్ కొరకు ఆచరించిన చర్యలను సాక్షిగా ఉంచి దుఆ చేయాలి. మహా ప్రవక్త(స) ఒకసారి కటిక చీకటి రాత్రిలో ఒక గుహలో చిక్కుకుపోయిన ముగ్గురు అనుచరుల గాధను వినిపించారు. వారు ముగ్గురు చిత్తశుద్ధితో చేసిన తమ సత్క్రియలను సాక్షిగా ఉంచి అల్లాహ్‌ను వేడుకోగా అల్లాహ్ వారి ఆపదను దూరం చేశాడు.



ముగ్గురు మిత్రులు కలిసి ఒకరాత్రి ఒక గుహలో తలదాచుకున్నారు. పర్వతంపై నుండి ఒక పెద్ద బండరాయి జారి గుహ ముఖ ద్వారానికి అడ్డంగా వచ్చి పడింది. గుహ మూసుకుపోయింది. అది చాలా పెద్ద రాతిబండి. ఆ బండను తొలగించే శక్తి వారికి లేదు. ఆప్పుడు వారు తమ తమ జీవితాలలో చేసిన స్వచ్ఛమైన పుణ్యకార్యాల్ని సాక్షిగా ఉంచి అల్లాహ్‌ను వేడుకోవాలని, దేవుడు అలాంటి దుఆ వింటే తమ ఆపద తొలగి పోగలదని నిర్ణయించుకున్నారు. ఆ ముగ్గురిలో ఒకతను ఇలా దుఆ చేశాడు:

నేను అడవిలో మేకల్ని మేపేవాణ్ణి. అదే నా జీవనాధారం. అడవి నుండి, తిరిగి రాగానే ముందు వృద్ధులైన నా తల్లిదండ్రులకు, ఆ తర్వాత నా పిల్లలకూ పాలు త్రాగించే వాణ్ణి. ఒకరోజు నేను ఆలస్యంగా వచ్చాను, నా తల్లిదండ్రులిద్దరూ పడుకొని ఉన్నారు. పిల్లలు మెలుకువతోనే ఉన్నారు. పాలు తల్లిదండ్రులకంటే ముందు పిల్లలకు త్రాగించడం నాకిష్టం లేదు. అలా అని తల్లిదండ్రులకు నిద్రాభంగం చేసి వారికి కష్టం కల్గించడానికి కూడా నాకు మనస్కరించ లేదు. అందువల్ల పాల పాత్రను పట్టుకుని రాత్రంతా వారి వద్ద నిలుచుని ఉండిపోయాను. పిల్లలు నా కాళ్ళు చుట్టుకుని ఏడుస్తున్నా సహిస్తూ, నేను మాత్రం ఉదయం వరకు అలాగే నిల్చుని ఉండిపోయాను. **"ఓ అల్లాహ్! నేను ఈ పనిని కేవలం నీ ప్రసన్నత కొరకే చేశాను, దాని శుభంతో గుహ ముఖం నుండి ఈ రాతిని తొలగించు."** వెంటనే రాతి బండ కొంచెం తొలగింది. ఆకాశం కనబడసాగింది.

రెండవ వ్యక్తి ఇలా దుఆ చేశాడు: "నేను కొందరు కూలీలతో పని చేయించుకుని అందరికీ కూలీ ఇచ్చి వేశాను. కాని ఒక వ్యక్తి తన కూలిని తీసుకోకుండా వెళ్ళి పోయాడు. కొన్ని ఏండ్ల తరువాత అతడు తన కూలి తీసుకోవడానికి వచ్చాడు. నేను అతనితో ఈ ఆవులు, మేకలు, సేవకులు అన్నీ నీవే, తీసుకువెళ్ళు అన్నాను. అతడు



నాతో పరిహాసం చేయకు అన్నాడు. పరిహాసం కాదు, వాస్తవంగా ఇవన్నీ నీవే, నీవు పదలి వెళ్ళిన డబ్బుని వ్యాపారంలో పెట్టాను, దేవుడు కరుణించాడు, వ్యాపారం బాగా సాగింది, నీవు చూస్తున్నదంతా దాని నుండి ప్రాప్తించినదే. నీవు సంతోషంగా వీటిని తీసుకెళ్ళు, ఇవన్నీ నీవే, అన్నాను. అతడు అన్నిటినీ తీసుకుని వెళ్ళిపోయాడు.**"ఓ అల్లాహ్ ఇలా నేను కేవలం నీ ప్రీతి కోసం చేశాను, దాని శుభంతో గుహముఖం నుండి ఈ రాతిని తొలగించు"** రాతిబండ ఇంకా కొంచెం తొలగింది.

మూడవ వ్యక్తి ఇలా దుఆ చేశాడు: నా చిన్నాన్న కూతురు ఒకామె ఉండేది. ఆమెను నేను గాఢంగా ప్రేమించాను. ఆమె నన్ను కొంత డబ్బు అడిగింది. నేను ఒక ఒప్పందం ప్రకారం డబ్బు ఇచ్చి వేశాను. కాని నా అవసరం తీర్చుకోవడానికి నేనామె దగ్గరకు సమీపించగానే–**"దేవునికి భయపడు, నీచమైన ఈ పనికి దూరంగా జరుగు"** అని అందామె. వెంటనే నేను లేచిపోయాను. నేను ఆ డబ్బును కూడా ఆమెకే వదిలేశాను. **"ఓ అల్లాహ్ నీకు అంతా తెలుసు. నేను అలా కేవలం నీ ప్రీతి కోసం చేశాను. దాని శుభంతో గుహ ముఖాన్నుండి ఈ రాతిని తొలగించు"** అల్లాహ్ గుహ ద్వారం నుండి ఆ బండను పూర్తిగా తొలగించాడు. ఆ ముగ్గురూ ఆపద నుండి బయటపడ్డారు.

ఈ ఘటన మనకు దుఆకై ప్రేరేపించడమే కాక మనల్ని ప్రశ్నిస్తుంది అదేమనగా, జీవితంలో మనమెప్పుడైనా అలాంటి ఒక చర్య కేవలం అల్లాహ్ కోసమే చేశామా? ఒక వేళ మనమేదైనా ఆపదకు గురైతే మన ఆ చర్య అల్లాహ్ సమక్షంలో సాక్ష్యంగా ఉండి మనల్ని అపాయం నుండి బయటకు తీయగలదా? అని.

క్యాన్సర్...7వ పేజీ తరువాయి భాగం

తర్వాతి వైద్యంకన్నా ముందస్తు పత్యం మిన్న

మసాలా వేపుళ్ళు ఎక్కువగా తీసుకునే వారిలో నోటి క్యాన్సర్, పేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కొన్ని రకాల ఆహార పదార్థాల్ని వేయించినప్పుడు అందులోని క్యాన్సర్ కారకాలు చైతన్యవంతం అవుతాయి. ముఖ్యం గొడ్డు, పంది మాంసాల్లో క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే గుణాలున్నాయని వరల్డ్ క్యాన్సర్ రిసెర్చ్ ఫౌండేషన్ ప్రకటించింది. వేయించిన మాంసం కంటే ఉడికించినదే తక్కువ ప్రమాదకారి. అలాగే పిజ్జాలు, బర్గర్లు, చిప్స్ వంటి వాటికి సాధ్యమైనంత వరకూ దూరంగా ఉండాలి. ఇలాంటి చిరుతిళ్ళలో రుచిని పెంచడానికి వాడే, కొన్ని రకాల రసాయనాలు ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. తీపి పదార్థాలు కూడా బాగా తగ్గించాలి. నిన్న మొన్నటి దాకా విదేశాల్లో బాగా విస్తరించిన పెద్ద పేగు క్యాన్సర్ ఇప్పుడు మన దగ్గర ఎక్కువతోంది అంటే కారణం, మనం పాశ్చాత్య రుచులకు మరగటమేనంటున్నారు.



సురక్షిత శృంగారం, అరక్షిత శృంగారం - రెండూ ప్రమాదకరమే!

ఆధునిక జీవితంలో లైంగిక విశృంఖలత హద్దులు మీరుతోంది. అది అరక్షిత శృంగారం కావచ్చు, సురక్షిత శృంగారం అవ్వొచ్చు - అక్రమ సంబంధం, స్త్రీపురుషుల విచ్చలవిడి కలయిక, సహజీవనం పేరుతో కామపిశాచాల్లా వ్యవహరించడం అనేది అనేకానేక అనర్థాలకు, లైంగిక వ్యాధులకు దారి తీస్తుంది. ఎయిడ్స్, సార్స్ వంటి మహమ్మారి రోగాల ప్రమాదమూ ఎక్కువే. ఎయిడ్స్ రోగుల్లో క్యాన్సర్ ప్రబలే అవకాశం అధికం. మలద్వార, గర్భాశయ ముఖద్వార, పురుషాంగ, యోని క్యాన్సర్లు కూడా విచ్చలవిడి లైంగిక అలవాట్లతో ముడిపడినవే.

తొలి దశలోనే గుర్తిస్తే....

మన శరీరానికి ఒక భాష ఉంది. ఏదో ఒక సందర్భంలో ఏదో ఒక రూపంలో మనతో మాట్లాడే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. అయినా మనం పట్టించుకోం. ఇది సరికాదు. శరీరంతో సంభాషించాలి. దాని ఆవేదనను అర్థం చేసుకోవాలి. దాని ఫిర్యాదును శ్రద్ధగా ఆలకించాలి. శరీరంలో ఏ చిన్న మార్పు కనిపించినా నిశితంగా పరిశీలించాలి. అవసరమైతే వైద్యుల్ని సంప్రదించాలి. వయసు పెరిగే కొద్దీ క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుంది. ఊబకాయం ఆరోగ్యానికి తొలి శత్రువు, మహిళలకైతే మరీ ప్రమాదకారి. కాబట్టి వ్యక్తిగత వ్యాయామం పరిశుభ్రతతోపాటు, ఇంటిని, పరిసరాల్ని శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలి. మానసిక సమస్యలు శరీరం మీద ప్రభావం చూపినప్పుడు ...అల్సర్, తలనొప్పి లాంటి రుగ్మతలొస్తాయి. శారీరక ఆరోగ్యం మనసును కృంగదిస్తే...ఆత్మహత్య ఆలోచనలు, విసుగు, కోపం, అసహనం తదితర ప్రభావాలు కనిపిస్తాయి. కాబట్టి జీవితంలో క్రమశిక్షణ చాలా అవసరం అలాగే ఆకలేస్తే అన్నం పెట్టమని అడగాలని కూడా ఆతెలియని చిన్నారులు, శరీరంలో ఓ మూలన చిన్నగా మొదలైన మార్పును మాత్రం ఎలా గుర్తిస్తారు? ఏమని చెబుతారు? ఆ పూచి కన్నవారిదే. తోబుట్టువులు క్యాన్సర్‌తో బాధపడుతున్న పిల్లల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. బిడ్డలకు ఆరోగ్యమైన భవిష్యత్తు ఇవ్వడం కన్నవారి బాధ్యత.

చివరి మాట స్థూలంగా

క్యాన్సర్ కణాలు ఎక్కడి నుంచో రావు. మన శరీరంలోంచే పుడతాయి. సమస్య మనలో ఉన్నప్పుడు, పరిష్కారం కూడా మనలోనే దొరుకుతుంది. క్యాన్సర్‌ను ఎదిరించడానికి రెండే మార్గాలు.

1) అది రాకుండా జాగ్రత్త పడటం.

2)....అయినా వస్తే తొలి దశలోనే గుర్తించడం, అధైర్యపడకుండా పోరాడటం. క్యాన్సర్ ఒట్టి పిరికిది. ధైర్యవంతుల ముందు, దాని ఆటలు ఎంతోకాలం సాగవు.



వినోదాల వింత జగతిలో వెంట వచ్చేదేమిరా!

(జీవన పయనం ఎగుళ్ళుదిగుళ్ళమయం. సుఖదుఃఖాల సమ్మేళనం. జయాపజయాల మిశ్రమం. ఈ జీవితాన్ని ప్రవక్త (స) చెట్టు నీడతో పోల్చారు. బాటసారి నీడ క్రింద సేద తీరేంత సమయం మాత్రమే మనం ప్రపంచలో ఉంటాము. సేద తీరాక, సమయం ఆసన్నమయ్యాక అవున్నా, కాదన్నా సకల సంపదలను, సంతానాన్ని, ప్రేమగా పెంచుకున్న ఉద్యానవనాల్ని, ఎంతో శ్రమ పడి కట్టుకున్న కలల సౌధాల్ని వదలి వెళ్ళక మానదు. కాబట్టి ఏది అవసమో ఏది అనవసరమో తెలుసుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది.

ఈ జీవిత పయనంలో మనల్ని మనం ఉన్నతులుగా తీర్చిదిద్దుకోవటం కోసం మన మానసిక, ఆర్థిక, దాంపత్య, ఆధ్యాత్మిక బలహీనతల్నీ, సమస్యల్నీ అధిగమించటం కోసం, మన అంతర్గత శక్తులు పట్టిష్టం చేసుకోవడం కోసం, అసలు సాఫల్యమేదో తెలుసుకోవడం కోసం, తద్వారా మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు మెరుగు పర్చుకోవడం కోసం, టెన్షన్, బోర్, నిరాసక్తత పారద్రోలటం కోసం, ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, ఆధ్యాత్మికంగా నిలదొక్కుకోవడం కోసం, సిసలైన పరలోక సాఫల్యం సాధించుకోవడం కోసం ఈ శీర్షిక ఉపయుక్తం కాగలదని గట్టి నమ్మకం. - శాంతి ప్రియ)

ఓ వ్యక్తి ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాడు. అంతలో అతనితోపాటు భార్యాపిల్లలు వచ్చి చేరారు. అందరూ కలిసి సంతోషకరమైన జీవితం గడపవలని, అందుకు కొన్నాళ్ళు విహార యాత్రకు బయలుదేరాలని సంకల్పించుకున్నారు. ప్రయాణ సన్నాహాలన్నీ పూర్తయ్యాయి. ఓ కారులో అందరూ బయలుదేరారు.



అందమైన ఇళ్ళు, పండి ఒలగిన పైరుమళ్ళు, పల్లెటూళ్ళు వాళ్ళను ఎంతగానో అలరిస్తున్నాయి. అందరూ ప్రకృతి సౌందర్యాన్ని చూసి పరవశించిపోతున్నారు. అంతలో దూరాన ఎవరో నిలబడి ఉన్నారు. దగ్గరకెళ్ళి చూస్తే మనోరంజని ముస్తాబయి ఉంది.



కారు ఆపవలసిందిగా చేయి ఊపుతోంది. కారు ఆపి ఏం కావాలని విచారించాడు మనిషి. నన్ను మనోరంజని అంటారు. నేను, మనిషి ఊహా జగతిలో ఓలలాడేలా చేస్తాను. అతన్ని కొత్త కోర్కెలతో అలరిస్తాను. ఐహిక రుచుల మజాను ఎలా జుర్రుకోవాలో నేర్పిస్తాను. ఏ మార్గాలనుసలిస్తే వాంఛలు తీరతాయో బోధ పరుస్తాను అంది. మనిషి భార్యాపిల్లల్ని సంప్రదించాడు. మాట అందుకుంటూ భార్య - అవునండి! కోరిక లేని జీవితం శూన్యం. ఆశల పల్లకి ఎక్కి ఊరేగాలంటే ఈ మనోరంజనిని మనతోపాటు కారులో కూర్చోబెట్టు కోక తప్పదు అంది. సరేనంటూ తలూపాడు మనిషి. మనోరంజని మనోరథం ఎక్కి కూర్చుంది.



క్రమేణా మనిషిని తన చెప్పుచేతల్లో ఉంచుకుంది. మనిషి మనసు గొర్రెలా మారి క్రమేణా గాడిద, కుక్క, తోడేలు రూపం దాల్చింది. అలా దానిసాగిపోతున్నారు అందరూ.

ముందుకు సాగిపోతున్న వారికి అల్లంత దూరాన మరెవరో నిలబడి చేయి ఊపుతున్న దృశ్యం కంట పడింది. అది ధన శ్రీ - (శ్రీ అంటే కీర్తి, విషం కుడా) నిలబడి ఉంది.



సమీపించి అడగ్గా - నన్ను ధనశ్రీ అంటారు. నా అవసరం అడుగడునా మీకుంటుంది. మీ మనోరథమైక్కి కూర్చున్న ఈ మనోరంజని గొంతెమ్మ కోర్కెలు తీరాలంటే నేనుంటేనే అది సాధ్యమవుతుంది. కాబట్టి నన్ను కూడా మీతోపాటు ఎక్కించుకోండి అని విన్నవించుకుంది ధనశ్రీ. మనిషి మళ్ళీ భార్యాపిల్లల్ని సంప్రదించాడు. అవును, ధనం అవసరం మనకెంతో ఉంది. ముఖ్యంగా ఈ విహార యాత్రలో అది లేకుండా ఏం మజా ఉంటుంది? చెప్పండి అని భార్య ధనశ్రీని వెనకేసుకొచ్చింది. సరేనంటూ ధనశ్రీని తమతో పాటు కూర్చోబెట్టుకున్నారు.



మళ్ళీ మనిషి మనసులో వింత మార్పు చోటు చేసుకుంది. అది పాములా, పందిలా మారి తర్వాత భయంకర మృగరూపం దాల్చింది. మనిషిలోని మనసులోన నిదుర పోయే దానవుణ్ణి చురకపెట్టి లేపింది. బురద కోర్కెలు జల్లింది.



అయినా మనిషికి స్పృహ లేదు. అలానే ముందుకు సాగిపోతున్నాడు. మరి కాసింత దూరంలో వెలుగు మూర్తి కాంతిని ప్రసరింపజేస్తూ కారు ఆపవలసిందిగా సైగ చేస్తున్నది. అది దివి నుండి భువికి అరుదెంచిన అక్షరాల ధర్మమూర్తి.

నేను ధర్మమూర్తి. మనిషి ఇహపర సాఫల్య నిమిత్తం దేవుడు నన్ను పంపాడు. మనిషికి సంబంధించినవన్నీ అతన్ని ఒంటరివాణ్ణి చేసి వదలిపోయినా నేను మాత్రం అతనితోనే ఉంటాను. అతని కావాల్సిన రక్షణను ఇస్తాను. మనోరంజని, ధనశ్రీలతోపాటు నేనుండటం ఎంతో అవసరం. కాబట్టి నన్నూ మీతోపాటు తీసుకోండి అని చెప్పుకొచ్చింది. మనిషి భార్యాపిల్లలను సంప్రదించాడు. వారు ససిమీరా అన్నారు. మనం వెళుతున్నది విహారనికి. అక్కడ ధర్మ మూర్తికి ఏం పని? మాటికి మాటికి మమ్మల్ని ఇది చేయకూడదు, అది చేయకూడదు అని విసిగించేందుకా? ఒకవేళ అవసరమే ఉంటే ఎముకలు ఉడిగే ముదిమికి చేరుకున్న మీదట ఆలోచిద్దాం అన్నారు. అలా ధర్మమూర్తిని తొడు తీసుకోలేదు మనిషి. అంతలో ఒక చెక్‌పోస్టు ఎదురయింది. కారు దిగి వారి వద్దకు చేరుకున్నాడు మనిషి. చెక్‌పోస్ట్ అంటే మరణం. అక్కడున్న వారు మరణ దూతలు.



నీ వద్ద ఏమేమి ఉన్నాయి? ప్రశ్నించారు. నా వద్ద ఆలు బడ్డలున్నారు, ఆస్తిపాస్తులున్నాయి, లెక్కలేనన్నీ కోర్కెలున్నాయి అన్నాడు మనిషి. అవేమీ ఇక్కడ చెల్లవు. ధర్మం ఎక్కడా? మళ్ళీ అడిగారు. అయ్యో! నా మతి మండ!! కాసింత దూరంలోనే వదిలేసి వచ్చాను. కొంచెం గడువు ఇస్తే వెళ్ళి వెంటబెట్టుకొస్తాను అని బతిమిలాడాడు మనిషి. 'కుదరదు నీ సమయం అయిపోయింది' సమాధానం లభించింది. అటు భార్యా పిల్లలు మీ సమస్య తీరక తీరిగ్గా రండి! అని బయలు దేరి వెళ్ళిపోయారు.

ఇటువంటి దుర్భర స్థితి ప్రతి ఒక్కరికీ ఎదురవు తుంది. కనుకనే ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ఈ రోజు కర్మలున్నాయి, విచారణ లేదు. రేపు విచారణ ఉంటుంది, కర్మలు ఉండవు". (బుఖారీ)

మరో సందర్భాన ఆయన (స) ఇలా సెలవిచ్చారు: "మృతునితోపాటు మూడు వస్తువులు వెళతాయి. ఆప్తులు, ఆస్తులు, కర్మలు. రెండు - ఆప్తులు, ఆస్తులు తిరిగి వచ్చేస్తాయి. ఒకటి- కర్మ మాత్రమే అతనితో ఉంటుంది" అని. (బుఖారీ, ముస్లిం)

అభిమాన సోదరులారా! దేని కోసం దేన్ని వదులుకోవాలో తెలిసుండటం విజయ సూత్రమైతే, దేని కోసం దేనిని వదులుకోవాలో మీరే నిర్ణయించుకోండి!



ముఖ్య ప్రకటన

- ఐపిసి స్త్రీల విభాగానికి ధర్మప్రబోధకురాలి అవసరం ఉంది.

అర్హత:

- ధార్మిక విద్యను ఆర్జించి ఉండాలి.
- మాతృ (తెలుగు) భాషతోపాటు అరబీ గానీ, ఆంగ్లంగానీ చదవటం మరియు వ్రాయటం వచ్చి ఉండాలి.
- అకామా ఉండాలి.
- మీ సివి ఫ్యాక్స్ (22512257) లేదా ఈమెయిల్ (ipc-sch @yahoo .com) ద్వారా పంపగలరు.

మీ వాణిజ్య ప్రకటనలను స్వాగతిస్తోంది. అధర్మమైన, అసభ్యకరమైన, అశ్లీలంతో కూడిన విషయాలు తప్ప మిగిలిన ప్రకటనలన్నీ వేయబడతాయి.

	Description	Advertisement Rate	30% Discount for One year	20% Discount for one Month
1	Inside Page of Front Cover	KWD 150	KWD 105	KWD 120
2	Inside Page of Back Cover	KWD 150	KWD 105	KWD 120
3	Single Page Inside	KWD 100	KWD 70	KWD 80
4	Two middle pages	KWD 200	KWD 140	KWD 160
5	Back Cover Page	KWD 200	KWD 140	KWD 160

Half Page : Half of the above mentioned rates ❖ Quarter Page : Quarter of the above mentioned rates

contact: abdussalamsyed@ymail.com, Tel.No: 97248933